teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 302 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | శుక్రవారం 8 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## పట్టపగలు గూండాల్లా వచ్చి దాడి చేస్తారా..?

- బీఆర్ఎస్ నేతలపై దాడిని ఖండించిన కేటీఆర్
- శాంతిభద్రతలను దెబ్బతీస్తున్న కేంద్ర మంత్రి
- ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే
- కౌశిక్ రెడ్డి, గంగుల ఆఫీసులపై దాడి.. కేటీఆర్ ఎక్స్ వేదికగా ఫైర్





# ప్రజాస్వామ్యమా..
# ధనస్వామ్యమా..?

### ఎన్నికల వేళ ఏరులై పారిన ధనం.. రికార్డు స్థాయిలో రూ. 1,444 కోట్లు సీజ్

### ఐదు రాష్ట్రాల్లో రికార్డు స్థాయి పట్టివేతలు.. ఐదేళ్లలో 44శాతం పెరిగిన ప్రలోభాలు

### ఎన్నికల వేళ ప్రలోభాల పర్వం.. ఓటర్లకు నగదు, మద్యం, డ్రగ్స్ వల

న్యూ ఢిల్లీ, మే 07 (తీన్మార్ న్యూస్)

మన ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు అనగానే ప్రలోభాల పర్వం మొదలవుతోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు వందల కోట్లు ఖర్చు చేస్తూ, ఓట్లను కొనుగోలు చేయడానికి ఏమాత్రం వెనుకాడటం లేదు. ఎన్నికల సంఘం ఎంత కట్టుదిట్టమైన నిఘా పెట్టినా ఈ అక్రమాలు ఆగడం లేదు. తాజాగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికలు రాజకీయ పార్టీల ధన ప్రవాహాన్ని మరోసారి తేటతెల్లం చేశాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ శాసనసభలకు జరిగిన సాధారణ ఎన్నికలతో పాటు, 5 రాష్ట్రాలలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం భారీగా తనిఖీలు చేపట్టింది. ఫిబ్రవరి 26, 2026 నుంచి మే 6, 2026 వరకు జరిగిన ఈ తనిఖీల్లో రికార్డు స్థాయిలో మొత్తం రూ. 1,444 కోట్లను సీజ్ చేసినట్లు గురువారం ఈసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన విస్తుపోయే వస్తువులను, నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్రీబీస్ (ఉచిత కానుకలు) రూపంలో పంచేందుకు ఉంచిన రూ. 518 కోట్ల విలువైన వస్తువులు, రూ. 154 కోట్ల నగదును సీజ్ చేశారు. - మిగతా 2లో



# కరీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి ప్రయత్నం
- వాహనం, కార్యాలయం ధ్వంసం
- సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి ఫైర్
- రేవంత్, బండి సంజయ్‌లపై వివాదాస్పద వ్యాఖ్యలు





కరీంనగర్, మే 07 (తీన్మార్ న్యూస్):

నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి ప్రయత్నం జరిగింది. అయితే ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అయితే క్యాంప్ కార్యాలయం, వాహనం అద్దాలు మాత్రం ధ్వంసం అయ్యాయి. బీజేపీ శ్రేణులు ఈ దాడికి పాల్పడ్డాయి. బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ శ్రేణులకు కోపం తెప్పించాయి. ఈ క్రమంలోనే ఆయనపై దాడికి ప్రయత్నించింది. దాడిలో కౌశిక్ క్యాంప్ కార్యాలయం కూడా ధ్వంసం చేశారు. ఈ దాడితో కరీంనగర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరీంనగర్‌లో పరిస్థితులపై తాజాగా తాజాగా కౌశిక్ రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించారు. - మిగతా 2లో




## నీట్ యూజీ ‘కీ’ విడుదల

### అధికారిక వెబ్‌సైట్‌లో ప్రాథమిక ఆన్సర్ కీ

హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):

ఎంబీబీఎస్, బీడీఎస్ ఇతర యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన అర్హత పరీక్ష నీట్ యూజీ 2026 మే 3న దేశవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది నీట్ ప్రశ్నాపత్రం కాస్త సులువుగానే వచ్చినట్లు నిపుణులు అంటున్నారు. దీంతో 2025తో పోల్చితే ఈ సారి కటాఫ్ పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా నీట్ యూజీ పరీక్ష ప్రొవిజినల్ ఆన్సర్ కీని ఎన్టీయే విడుదల చేసింది. అన్ని సిరీస్‌ల ప్రశ్నపత్రాలకు సంబంధించిన ఆన్సర్ కీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కాగా - మిగతా 2లో

## రాహుల్ గాంధీకి హైకోర్టులో షాక్..?



- ఆస్తుల కేసులో రికార్డులు సీల్ చేయాలని ఆదేశం
- అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు

### కుటుంబాన్ని లాగితే
## ఊరుకోను



- నా కోపానికి హద్దులు ఉండవు
- నాకు ఏ పార్టీలోనూ సభ్యత్వం లేదు
- సినీ రంగానికే నా సేవలు
- పోసాని కృష్ణమురళి ఘాటు హెచ్చరిక

# ధాన్యం కొనమని కాళ్ళు మొక్కలా ..

- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- వర్ధన్నపేటలో రైతుల మహా ధర్నా

వరంగల్, మే 07 (తీన్మార్ న్యూస్):

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన బాట పట్టారు. వడ్లు కొనుగోలు చేయాలంటూ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలోని అంబేద్కర్ సెంటర్ - మిగతా 2లో





## కబ్జాలపై రాజీలేని పోరాటం

- 85 వేల కోట్ల భూమి రక్షితం
- హైడ్రా విస్తరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఏవీ రంగనాథ్

## కబ్జాలపై రాజీలేని పోరాటం

**మిర్యాలగూడ, మే 07 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణలో భూ ఆక్రమణదారులు, ముఖ్యంగా చెరువుల కబ్జాదారుల పాలిట సింహస్వప్నంగా మారిన హైడ్రా ఇకపై రాష్ట్రవ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరించనుంది. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పర్యటించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మీడియాలో మాట్లాడుతూ ఈ సంచలన విషయాన్ని వెల్లడించారు. హైడ్రా సేవలను రాష్ట్రం మొత్తం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ విస్తరణ నిర్ణయం తీసుకుందని ఆయన స్పష్టం చేశారు.

**రూ. 85,000 కోట్ల భూముల రక్షణ.. మరో లక్ష కోట్లు లక్ష్యం!**

హైడ్రా ఇప్పటివరకు సాధించిన విజయాలను కమిషనర్ ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ. 85,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడగలిగామని, మరో సంవత్సర కాలంలో ఒక లక్ష కోట్ల విలువైన భూములను రక్షించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. హైడ్రా పరిధిలో దాదాపు రూ. 10 లక్షల కోట్ల విలువైన భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం ఉందని, వాటన్నింటినీ వెలికితీసి ప్రభుత్వపరం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**నాలుగు వారాల పాటు 'ప్రజావాణి' రద్దు**

భూ కబ్జాలపై వేల సంఖ్యలో ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నాలుగు వారాల పాటు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రంగనాథ్ వెల్లడించారు. జూన్ 8వ తేదీ నుంచి ప్రజావాణి తిరిగి ప్రారంభమవుతుందని తెలిపారు. ఇప్పటికే అందిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, బాధితులకు త్వరగా న్యాయం చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశమని ఆయన వివరించారు.

**అవసరమైతే నేరుగా కార్యాలయానికి రావొచ్చు**

తమ సమస్యలు అత్యవసరమని భావించే బాధితులు నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి అధికారులను కలవవచ్చని కమిషనర్ సూచించారు. కొత్తగా ఫిర్యాదు చేయాలనుకునే వారికి కూడా ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. హైడ్రా చర్యలను అడ్డుకునేందుకు కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నప్పటికీ, చట్టం పరిధిలో అక్రమ కట్టడాలపై రాజీలేని పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కమిషనర్ రంగనాథ్ తాజా వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూ బకాసురుల్లో వణుకు మొదలైంది.

## విజయ్ పార్టీని ఆహ్వానించకపోవడం రాజ్యాంగ ద్రోహమే

**రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేస్తున్న గవర్నర్**

**తమిళనాడు గవర్నర్ పై టీపీసీసీ చీఫ్ ధ్వజం**



**హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించక పోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని ఈ సందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు. కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇకపై రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు

తెలంగాణలోని స్వయం సహాయక సంఘాలకు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వేసవి కాలంలో చల్లని కబురునందించారు. ప్రస్తుతం ఇస్తున్న వడ్డీలేని రుణాలను రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతగానో మేలు జరగనుంది. ఇది చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ.10 లక్షల బ్యాంకు రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు. ఇవాళ ప్రజా భవన్‌లో జరిగిన మహిళ స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, బ్యాంకర్లు, స్త్రీ నిధి డిప్యూటీ ఎండీ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక ఏడాదిలో మహిళా సంఘాల సభ్యులకు రూ. 25,228.89 కోట్లు బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మహిళా సంఘాల రుణాల వడ్డీల కోసం మరో రూ.2,500 కోట్లను ఎక్కువగా కేటాయిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. 'మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి' అన్న నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీతక్క పేర్కొన్నారు. మహిళలు పేదరికం నుంచి బయట పడినప్పుడే అభివృద్ధి పరిపూర్ణం అవుతుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. గతంలో

## పట్టపగలు గూండాల్లా వచ్చి దాడి చేస్తారా..?

**హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):**

కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు

## మహిళా స్వయం సహాయక బృందాలకు భారీ ఊరట

**మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణం రూ. 10 లక్షలకు పెంపు**

**మంత్రి సీతక్క కీలక ప్రకటన**



**హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క భారీ ఊరటనిచ్చారు. ఇప్పటి వరకు ఒక్కో గ్రూపునకు అందుతున్న వడ్డీ లేని రుణ పరిమితిని రూ. 5 లక్షల నుండి ఏకంగా రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పెంచిన రుణ మొత్తానికి అయ్యే వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ ఏడాది వడ్డీ చెల్లింపుల కోసమే ప్రభుత్వం రూ. 2,500 కోట్లు కేటాయించిందని ఆమె వివరించారు. మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అనే నినాదంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని కోటీశ్వరులను చేయడమే తమ సంకల్పమని సీతక్క స్పష్టం చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా బ్యాంకు రుణాలను మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే, మహిళా శక్తికి ప్రాధాన్యతనిస్తూ 40 శాతం పంట కొనుగోలు కేంద్రాల నిర్వహణను కూడా వారికే అప్పగించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తన గతాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పేదరికం, వడ్డీ వ్యాపారుల దోపిడీ వల్ల సామాన్యులు పడే బాధలను చూడలేకే తాను గతంలో తుపాకి పట్టి నక్సలైట్లలో చేరానని ఆమె వివరించారు. ఆ చేదు అనుభవాల నుంచే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాలనే బలమైన సంకల్పం ఏర్పడిందని చెప్పారు. ఒకప్పుడు రూ. 10 వేల రుణం పొందడమే కష్టంగా ఉండేదని, కానీ నేడు బ్యాంకులు లక్షల రూపాయల రుణాలు ఇచ్చే స్థాయికి మహిళలు ఎదిగారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రుణాల రికవరీలో మహిళా సంఘాల పనితీరుపై మంత్రి ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, డీఆర్‌డీఓ విజయలక్ష్మిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని జిల్లాలు 100 శాతం రీపేమెంట్ చేసి బ్యాంకర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ఎలాంటి నిబంధనలు కఠినతరం చేయవద్దని, ప్రభుత్వం గ్యారెంటీగా ఉంటుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

## జై శ్రీరాం అంటే కొండంతా బలం

**అనుచితంగా మాట్లాడితే పదవి ఊడుతుంది**

**కొండా సురేఖతో రాజీనామా చేయించండి**

**సీఎం రేవంత్‌కు రాజాసింగ్ హితవు**



**హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):**

జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ ఎలా అంటారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈరోజు (గురువారం) హైదరాబాద్ వేదికగా రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంతా బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమీషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

## ప్రజాస్వామ్యమా.. ధనస్వామ్యమా..?

-మొదటిపేజీ తరువాయి

వీటితో పాటు రూ. 337 కోట్ల విలువైన డ్రగ్స్, రూ. 250 కోట్ల రూపాయల విలువైన బంగారం, ఆభరణాలు మరియు 7 లక్షల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

**ఐదేళ్లలో 44 శాతం పెరిగిన ప్రలోభాల ఖర్చు**

గతం కంటే ఈసారి ప్రలోభాల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఈసీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల సమయంలో పట్టుబడిన మొత్తం సొత్తు రూ. 1,029 కోట్లు కాగా.. 2026 నాటికి ఆ మొత్తం రూ. 1,444 కోట్లకు చేరుకుంది. అంటే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు చేసే ఖర్చు గడిచిన ఐదేళ్లలో ఏకంగా 44 శాతం పెరగడం ప్రజాస్వామ్యవాదులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## ధాన్యం కొనమని కాళ్ళు మొక్కలా ..

-మొదటిపేజీ తరువాయి

వద్ద రైతులు భారీ ధర్నాకు దిగారు. మార్కెట్ కు వడ్లు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా.. అధికారులు ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును అన్నదాతలు తీవ్రంగా తప్పుబట్టారు. రైతులను బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వారీగా విభజించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కాంటాలు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కిందిస్థాయి అధికారులు బేఖాతరు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు.

కాళ్లు మొక్కాల్సిన దుస్థితి:

"దేశానికి అన్నం పెట్టే రైతులం.. మేం ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయమని అధికారుల కాళ్లు మొక్కాల్సిన దుస్థితి రావడం అత్యంత బాధాకరం" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ?తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, కాంటాలు వేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించే వరకు తమ ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. ఈ ధర్నాతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## రాహుల్ గాంధీకి హైకోర్టులో షాక్..?

**మే 12న తదుపరి విచారణ**

**తెలంగాణ బ్యూరో, మే 07 (తీన్మార్ న్యూస్):**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సంబంధించిన ఒక కీలక పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై దాఖలైన ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు, ఈ కేసుకు సంబంధించిన పేపర్ బుక్ (పిటిషన్ రికార్డులను) సీల్ చేసి భద్రపరచాలని స్పష్టం చేసింది. జస్టిస్ రాజేష్ సింగ్ చౌహాన్, జస్టిస్ జాఫర్ అహ్మద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను ఇచ్చింది. పిటిషన్‌లోని సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని, ఆ రికార్డులను సీనియర్ రిజిస్ట్రార్ సురక్షిత సంరక్షణలో ఉంచాలని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలో ధర్మాసనం కార్యదర్శి సమక్షంలోనే వీటిని అన్‌సీల్ చేయాలని కోర్టు పేర్కొంది. రికార్డుల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్. విఘ్నేష్ శిశిర్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. రాహుల్ గాంధీ తోపాటు ఆయన కుటుంబ సభ్యులు తమకు తెలిసిన ఆదాయ వనరుల కంటే అత్యధికంగా ఆస్తులు కలిగి ఉన్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ చేత సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే ఒక సాధారణ కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కేసులో సీబీఐతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ లను కూడా ప్రతివాదులుగా చేర్చారు. ఈ కేసులో ప్రాథమిక వాదనలను విన్న అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం, తదుపరి విచారణను మే 12వ తేదీన మధ్యాహ్నం 2:15 గంటలకు షెడ్యూల్ చేసింది. పిటిషనర్ అభ్యర్థన మేరకు కోర్టు రికార్డులను భద్రపరచాలని తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న రాహుల్ గాంధీపై వచ్చిన ఈ ఆస్తుల ఆరోపణల పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది. అత్యున్నత దర్యాప్తు సంస్థలను ఇందులో భాగస్వాములను చేయాలని కోరడం, కోర్టు రికార్డులను సీల్ చేయాలని ఆదేశించడం వంటి పరిణామాలు మే 12న జరగబోయే విచారణపై ఉత్కంఠను పెంచుతున్నాయి.

## నీట్ యూజీ 'కీ' విడుదల

-మొదటిపేజీ తరువాయి

ఈ ఏడాది నీట్ యూజీ పరీక్షకు దేశ వ్యాప్తంగా మొత్తం 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరందరికీ 5,432 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీలను తాజాగా ఎన్టీయే విడుదల చేసింది. తొలుత స్కాన్ చేసిన ఓఎంఆర్ షీట్‌లను అప్‌లోడ్ చేస్తామని, ఆ తర్వాతే అభ్యంతరాలు తెలిపేందుకు విండోను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. తేదీలను త్వరలోనే తెలియజేస్తామని ఎన్‌టీఏ తన ప్రకటనలో తెలిపింది. నీట్ పరీక్షకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఇతర సందేహాలు ఉంటే 011-40759000 /011-69227700 నంబర్లను ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు లేదా ఈ-మెయిల్ అవవ్‌బన్త్ర2026ఏఙ్ఖ.ఖఏ.ఱఅ ద్వారా సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి నీట్ యూజీ పేపర్ తేలికగా ఉన్నందున కటాఫ్‌లు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. పేపర్ మధ్యస్థంగా ఉన్నప్పుడు, ఎక్కువ మంది విద్యార్థులు ఒకే రకమైన మార్కులు సాధిస్తారు. దీంతో కటాఫ్‌లు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## కరీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత

-మొదటిపేజీ తరువాయి

శాంతి భద్రతల విషయంలో సీపీ గౌష్ ఆలంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అదే సమయంలో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పైనా తీవ్ర పదజాలం ఉపయోగించారు. దీంతో బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. మరోవైపు.. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పైనా బీజేపీ శ్రేణులు దాడి చేశాయి. పాడి కౌశిక్‌రెడ్డి అక్కడ ఉన్నాడనే సమాచారంతో విధ్వంసం సృష్టించాయి. ఈ పరిణామంతో అక్కడి సిబ్బంది భయంతో పరుగులు తీశారు.

## కుటుంబాన్ని లాగితే ఊరుకోను

**హైదరాబాద్, మే 07 (తీన్మార్ న్యూస్):**



అకారణంగా తనని, తన కుటుంబాన్ని తిడితే ఊరుకోనిని సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఘాటు వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘకాలం తర్వాత గురువారం ప్రెస్‌మీట్‌లో పోసాని మాట్లాడారు. నాకు ఏ పార్టీలోనూ సభ్యత్వం లేదు. నాకు నచ్చిన పార్టీలన్నింటికీ సర్వీస్ చేశాను. చంద్రబాబు మంచిగా ఉన్నప్పుడు ఆయనకూ సర్వీస్ చేశా. సినీ రంగానికి సేవల కోసమే నాకు ఎఫ్‌డీసీ చైర్మన్ పదవి ఇచ్చారు. నిజం చెబితే ఎవరినైనా టార్గెట్ చేయడం సహజమే. అకారణంగా నన్ను, నా కుటుంబాన్ని తిడితే ఊరుకోను. నా కోపానికి ఎలాంటి హద్దులు ఉండవు అని వ్యాఖ్యానించారు.

# కేరళ సీఎం సీటుకు హోరాహోరీ పోరు

కేరళ నూతన ముఖ్యమంత్రి రేసు రసవత్తరంగా మారింది. ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన కాంగ్రెస్ పార్టీ, నూతన సీఎం ఎంపికకు ముమ్మర కసరత్తు చేస్తోంది. దీంతో ముఖ్యమంత్రిగా ఎవరు ఎంపికవుతారు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశాన్ని పర్యవేక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించిన పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ తిరువనంతపురంకు చేరుకున్నారు. నగరంలోని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో వారు పాల్గొన్నారు. కేరళ సీఎం ఎంపికపై తుది నిర్ణయాన్ని తీసుకునే అధికారాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఇస్తూ ఏక వాక్య తీర్మానాన్ని ఆమోదించడంతో ఈ సమావేశాన్ని ప్రారంభించారు. వెంటనే ఏఐసీసీ పరిశీలకులు ప్రతీ ఎమ్మెల్యేతో సుదీర్ఘంగా ముఖాముఖిగా మాట్లాడారు. సీఎం ఎవరైతే బాగుంటుంది అనే దానిపై అందరు ఎమ్మెల్యేల రహస్య ప్రాధాన్యతలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా సేకరించిన సమాచారంలోని ఎమ్మెల్యేల మెజారిటీ అభిప్రాయానికే కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రాధాన్యం ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విధంగా కేరళ సీఎం ఎంపిక ప్రక్రియతో ఓ వైపు తిరువనంతపురం, మరోవైపు దిల్లీలోని కాంగ్రెస్ వర్గాల్లో రాజకీయ వేడి రాచుకుంది.

**కేసీ వేణుగోపాల్‌కు ఛాన్స్ దక్కేనా?**

పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కూటమి కేరళలో గెలిచింది. 102 సీట్ల భారీ మెజారిటీని సాధించింది. ఇప్పుడు సీఎం సీటు కోసం జరుగుతున్న పోటీలో ప్రధానంగా ముగ్గురు అగ్రనేతల పేర్లు వినిపిస్తున్నాయి. వారే వి.డి.సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) హోదాలో ఉన్నారు. పార్టీ హైకమాండ్‌లోని ముఖ్య నేతలతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ప్రత్యేకించి అగ్రనేత రాహుల్ గాంధీతో సాన్నిహిత్యం ఉంది. దీనికి తోడు మాజీ కేరళ పీసీసీ అధ్యక్షుడు కె.సుధాకరన్ బహిరంగ మద్దతును ప్రకటించడంతో, రాష్ట్ర సీఎం రేసులో కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారనే టాక్ మొదలైంది. మాజీ సీఎంలు కే కరుణాకరన్, ఒమెన్ చాందీల బాటలోనే కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా కేసీ వేణుగోపాల్ బలోపేతం చేస్తున్నారని ఇటీవలె కె.సుధాకరన్ వ్యాఖ్యానించారు. కేసీ వేణుగోపాల్ 2024 సాధారణ





ఎన్నికల్లో కేరళలోని ఆలప్పుళ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. లోక్‌సభకు ఎన్నికవ్వడానికి ముందు ఆయన రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఉండేవారు.

**ప్రతిపక్ష నేతగా రాణించిన వి.డి. సతీశన్**

2021 నుంచి కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన వి.డి. సతీశన్ కూడా సీఎం రేసులో ఉన్నారు. ఈయన గత ఐదేళ్లుగా ప్రతిపక్ష నేత హోదాలో అధికార పక్ష వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పరవూర్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఆరోసారి ఘనవిజయం సాధించారు. కేరళ సీఎం పదవికి ఈయనే ప్రధాన పోటీదారు అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ ఎన్నికల్లో కేరళ ప్రజలు ఇచ్చిన తీర్పు వి.డి. సతీశన్ నాయకత్వానికి ప్రత్యక్ష ఆమోదం లాంటిదని ఆయన మద్దతుదారులు, ముస్లిం లీగ్ వంటి ప్రధాన మిత్రపక్షాలు వాదిస్తున్నాయి. తనకు సీఎం పదవిని కేటాయించకుంటే, ఇతరత్రా మంత్రి పదవులను అంగీకరించ కూడదు అనే గట్టి వైఖరిని వి.డి.సతీశన్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

**పాలనా, సంస్థాగత అనుభవం కలిగిన రమేశ్ చెన్నితాల**

సీఎం రేసులో బలమైన పోటీదారుగా నిలుస్తున్న మరో సీనియర్ నేత పేరు రమేశ్ చెన్నితాల. ఆయన గతంలో కేరళ రాష్ట్ర హోం మంత్రిగా, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా (2016–2021), కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో రమేశ్ చెన్నితాల శాశ్వత ఆహ్వానితుడిగా జాతీయ స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు పరిశీలకుడిగా, ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు చూస్తున్నారు. 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన హరిపాడ్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఆరోసారి ఘనవిజయం సాధించారు.ఆయనకు దశాబ్దాల పరిపాలనా, సంస్థాగత అనుభవం ఉంది.

**మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్**

కేరళ నూతన సీఎం ఎవరనే దానిపై వి.డి.సతీశన్, రమేశ్ చెన్నితాల, కేసీ వేణుగోపాల్ మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్ నడుస్తోంది. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం ఆలప్పుళ లోక్‌సభ సభ్యునిగా ఉన్నారు. ఆయన సొంత జిల్లా కూడా ఆలప్పుళే. ఒకవేళ వేణుగోపాల్‌ను కేరళ ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తే, ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఆలప్పుళలో మళ్లీ ఉప ఎన్నిక వస్తుంది. ఈనేపథ్యంలో ఆలప్పుళపై ఉప ఎన్నికను రుద్దే ప్రయత్నాన్ని మానుకోండి అనే సందేశంతో, కాంగ్రెస్ సహయాత్రికులు పేరుతో ఆలప్పుళ జిల్లాలో బ్యానర్లు వెలిశాయి. వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా ఆలప్పుళ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఎదుట వెలిసిన పోస్టర్లను ఒక వర్గం కార్యకర్తలు చించివేశారు. కొట్టాయం వంటి ప్రాంతాల్లో వేణుగోపాల్‌ను విజయ శిల్పి అని పొగిడే పోస్టర్లపై గుర్తుతెలియని వ్యక్తులు నల్ల రంగు పూశారు. మరోవైపు, ఇందిరా భవన్ బయట వేణుగోపాల్‌కు మద్దతుగా ఫ్లెక్సీ బోర్డులు కనిపించాయి. ఈవిధమైన అంతర్గత కలహాలు, ప్రజల్లో వ్యక్తమవుతున్న భావోద్వేగాల వల్ల కేరళ సీఎం ఎంపిక ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారుతోంది.

**ఏఐసీసీ పరిశీలకుల నివేదికే కీలకం**

రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం అందరినీ కలుపుకొని ముందుకు సాగేలా చూసేందుకు ఏకే ఆంటోనీ వంటి సీనియర్ నాయకులతో, ముస్లిం లీగ్ వంటి కీలక సంకీర్ణ భాగస్వాములతోనూ ఏఐసీసీ పరిశీలకులు సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో తాము గుర్తించిన, నమోదు చేసిన వివరాలను, ఎమ్మెల్యేల అభిప్రాయాలను వారు కాంగ్రెస్ హైకమాండ్‌కు సమర్పించనున్నారు. గురువారం రాత్రే ఏఐసీసీ పరిశీలకులు దిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. బహుశా ఆదివారం(మే 10) నాటికి సీఎం ఎంపికపై కాంగ్రెస్ హైకమాండ్ తుది ప్రకటనను విడుదల చేయొచ్చని పార్టీ సీనియర్ నాయకుడు కె. మురళీధరన్ తెలిపారు. సంస్థాగత సీనియారిటీతో పాటు స్థానిక నాయకత్వ యోగ్యతలను కలిగిన కాంగ్రెస్ నేతను సీఎంగా ఎంపిక చేసే వరకు దీనిపై ఉత్కంఠ కొనసాగనుంది.

# విజయ్ ప్రమాణస్వీకారంపై క్లారిటీ ఇచ్చిన లోక్ భవన్

తమిళనాడులో రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి. ప్రభుత్వ ఏర్పాటు గవర్నర్ అంగీకారం తెలుపలేదని అంతకుముందు వార్తా కథనాలు వెలువడ్డాయి. 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని నిరూపించాలని గవర్నర్ విజయ్‌కు సూచించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఆ వార్తలపై లోక్‌భవన్ తాజాగా ప్రెస్‌నోట్ విడుదల చేసింది. అందులో, ప్రభుత్వం ఏర్పాటుకు మెజారిటీ చూపాల్సిన అవసరాన్ని విజయ్‌కు గవర్నర్ వివరించారని పేర్కొంది. “ఇవాళ గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు” అని లోక్‌భవన్ అధికారిక ప్రకటనలో వెలువడింది.

అయితే, గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు అనంతరం రెండు రోజుల వ్యవధిలో వీరి భేటీ జరిగడం ఇది రెండో సారి. ఇప్పటికే టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ అయ్యారు.

**లోక్‌భవన్ వెలుపల టీవీకే నిరసన**

మరోవైపు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్?ను అనుమతించాలని డిమాండ్ చేస్తూ, ుఎఖ కార్యకర్తలు లోక్ భవన్ వెలుపల ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మెజారిటీని నిరూపించుకోవడానికి లోక్?భవన్? సరైన వేదిక కాదని, శాసనసభ మాత్రమే సరైన స్థలమని టీవీకే కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో 108 మంది ఎమ్మెల్యేలను గెలుచుకొని తమ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని



వారు గుర్తు చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో, గవర్నర్? బీజేపీకి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్?కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గురువారం విజయ్? ప్రమాణ స్వీకారం చేయలేకపోయినందున తాము నిరాశ చెందామని, అయితే, విజయ్? ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవరకు చెన్నైలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లు టీవీకే కార్యకర్తలు తెలిపారు.

**టీవీకేకు మద్దతు అంశంపై వామపక్ష పార్టీల్లో చర్చ**

ఇదిలా ఉండగా, టీవీకేకు మద్దతు అంశంపై వామపక్ష పార్టీల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని విజయ్ తమ పార్టీకి లేఖ రాశారని సీపీఐ నాయకుడు వీరపాండియన్ తెలిపారు. దీనిపై చర్చించేందుకు శుక్రవారం అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశం అనంతరం తుది నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించారు. అలాగే డీఎంకే నేత ఎంకే స్టాలిన్‌తో జరిగిన సమావేశం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని వీరపాండియన్ స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో బీజేపీ గందరగోళం సృష్టిస్తోంది!**


మరోవైపు విడుతలై చిరుతైగల్ కచ్చి (వీకేసీ) అధినేత తోల్ తిరుమావళవన్ కూడా గవర్నర్‌ను కలిసి టీవీకేకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అదేసమయంలో బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. తమిళనాడు రాజకీయాల్లో బీజేపీ జోక్యం చేసుకుంటూ గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. “టీవీకే రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాబట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. అదే రాజ్యాంగం సూచించే విధానం. విజయ్ మద్దతు కోరుతూ ప్రయత్నాలు చేస్తున్నా గవర్నర్ నిర్ణయం తీసుకోకుండా అనిశ్చితికి తావిస్తున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు” అని వీసీకే అధినేత తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. టీవీకేకు మద్దతు అంశంపై తమ పార్టీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. విజయ్ నుంచి మద్దతు కోరుతూ లేఖ అందిందని తెలిపారు. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుంది. అయితే, విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి రావడంతో పార్టీ బలం 107కు తగ్గనుంది. కాంగ్రెస్‌కు ఉన్న ఐదు స్థానాలు కలిపినా కూటమి బలం 112కే పరిమితం అవుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజారిటీకి ఇంకా ఐదు స్థానాలు తక్కువగా ఉన్నాయి.

# ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు

పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరం సురక్షితం కాదని ‘ఆపరేషన్ సిందూర్’ నిరూపించిందని, ఇది ముగింపు కాదని కేవలం ఆరంభం మాత్రమేనని భారత సైన్యం వెల్లడించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌ను శిక్షించడానికి, గత అర్ధ శతాబ్దంలో భారతదేశం చేపట్టిన అత్యంత విస్తృతమైన పోరాట మిషన్‌గా అభివర్ణించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఏడాది పూర్తైన నేపథ్యంలో అందుకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ త్రివిధ దళాల అధిపతులు జైపూర్‌లో సంయుక్త పత్రికా సమావేశం నిర్వహించారు.

**ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభమని వెల్లడి**

ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యూహాలకు కొత్త పాఠంగా నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ మాట్లాడిన జనరల్ రాజీవ్, సమాచార, నిఘా, దీూఖీ, సైన్యం వంటి అన్ని విభాగాల మధ్య అద్భుతమైన సమన్వయం విజయానికి కారణమన్నారు. ఈ ఆపరేషన్‌లో బ్రహ్మోస్, ఆకాశ్‌తో సహా మరెన్నో స్వదేశీ ఆయుధాలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయన్నారు. అత్యంత తక్కువ సమయంలో ఒక సంక్లిష్టమైన ఆపరేషన్‌కు ప్రణాళిక చేసి అమలు చేశామన్నారు. ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని చెప్పారు. ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడు కోగలదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదని, ప్రారంభమని జనరల్ రాజీవ్ ఉద్ఘాటించారు. “ఆపరేషన్ సిందూర్ జరిగి సరిగ్గా నేటికి ఏడాది పూర్తైంది. అప్పటి డీజీఎంవోగా దీనిని కేవలం ఒక



సైనిక చర్యగా మాత్రమే కాకుండా, భారత్ వ్యూహాత్మక ప్రయాణంలో ఒక కీలక ఘట్టంగా భావిస్తున్నాను. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన పాత పద్ధతులు, విధానాలను పక్కన పెట్టి ఖచ్చితత్వం, సమతుల్యత, స్పష్టమైన లక్ష్యంతో నియంత్రణ రేఖ వెంబడి, పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఇది ఒక దేశం ప్రదర్శించిన సంకల్పం, బాధ్యత, వ్యూహాత్మక సంయమనానికి నిదర్శనం.”

**‘13 పాకిస్థానీ విమానాలను ధ్వంసం చేశాం’**

ఆపరేషన్ సిందూర్ వాయుశక్తి ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటించిందని అప్పటి వైమానిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్, ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత బలగాలు 13 పాకిస్థానీ విమానాలను ధ్వంసం చేశాయని వెల్లడించారు. 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశామని, దీనికి సంబంధించిన రుజువులు అందరికీ అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. “మే 7న పాకిస్థాన్?లోని 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేశాము. దానికి సంబంధించిన రుజువులు అందరూ చూసేందుకు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశాం. నేలపైన లేదా గాలిలో ఉన్న వారి 13 విమానాలను ధ్వంసం చేశాం. అందులో 300 కిలోమీటర్లకు పైగా రికార్డు దూరంలో ఒక అత్యంత విలువైన వైమానిక ఆస్తిని కూడా కూల్చాం.” అని ఆయన అన్నారు. భారత సైనిక లేదా పౌర మౌలిక సదుపాయాలకు ఎలాంటి గణనీయమైన నష్టాన్ని కలిగిం చడంలో పాకిస్థాన్ విఫలమైందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ పదేపదే చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తోసిపుచ్చారు.

**పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్**

జమ్ము కశ్మీర్?లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురువారంతో ఏడాది పూర్తి చేసుకుంది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, మే 7 అర్ధరాత్రి భారత్ ఈ భారీ సైనిక చర్య చేపట్టింది.

## రిసార్ట్‌కు 28మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొనడంతో అన్నాడీఎంకే తమ ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని రిసార్టుకు తరలించింది. సుమారు 28 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలకు వసతి కల్పించినట్లు తెలుస్తోంది. ఈ ఎమ్మెల్యేలు అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు సి.వి. షణ్ముగం మద్దతుదారులని వార్తలు వస్తుండటంతో రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలకు దారితీసింది. కాగా, అన్నాడీఎంకే తరఫున ఎన్నికైన 47 మంది ఎమ్మెల్యేల్లో కొంత మంది విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తమిళనాడు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

**పవర్ షేరింగ్‌పై కూడా చర్చలు!**

ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకేకు మద్దతు ఇచ్చే విషయంపై ఏఐఏడీఎంకే నాయకులతో తమిళనాడు మాజీ మంత్రి, టీవీకే నేత కేఏ సెంగోట్టయ్యన్‌తో సహా పార్టీ సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. పవర్ షేరింగ్?పై కూడా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. దీని ప్రకారం సీవీ షణ్ముగంకు కీలక మంత్రి పదవులతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా ఆఫర్ చేసే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే 28 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించడంతో రాజకీయ ఊహాగానాలు మరింత బలాన్ని చేకూర్చాయి. కాగా, ఈ రిసార్ట్?ను అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామి సన్నిహితుడు సీవీ షణ్ముగం బుక్ చేసినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని గదులు బుక్ చేయనున్నట్లు సమాచారం.

**పార్టీ నాయకత్వంలో విభేదాలు**

మరోవైపు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రతిపాదనకు ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి అంగీకరించకపోవడంతో పార్టీ నాయకత్వంలోని కొన్ని వర్గాల్లో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వంలో కీలక పదవులు తీసుకుని టీవీకేకు మద్దతు ఇవ్వడానికి సీవీ షణ్ముగం, ఓఎస్ మణియన్‌తో సహా పలువురు నాయకులు సుముఖంగా ఉన్నారని సమాచారం. అయితే, ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియకు సంబంధించి సుప్రీం కోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించడం ద్వారా చట్టపరమైన మార్గాలను అన్వేషించాలని టీవీకే భావిస్తోంది. తిరిగి ఎన్నికలకు వెళ్లే అవకాశాన్ని కూడా కొందరు నాయకులు సూచించారని వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, గురువారం చెన్నైలోని లోక్?భవన్?లో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను టీవీకే అధినేత విజయ్ మరోసారి కలిశారు. మెజారిటీని చూపించి, మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల జాబితాను సమర్పించాలని విజయ్‌ను గవర్నర్? కోరారని లోక్?భవన్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్?పై స్పష్టత ఇవ్వాలని గవర్నర్ కోరినట్లు పేర్కొన్నాయి. అంతకుముందు పార్టీలో ఎలాంటి విభేదాలు, చీలికలు లేవని ఏఐఏడీఎంకే అధికార ప్రతినిధి సత్యన్? స్పష్టం చేశారు. అలాగే, ఏఐఏడీఎంకే, టీవీకే వర్గాల మధ్య చర్చలు జరిగాయని చెప్పారు. అయితే, హైకమాండ్? నిర్ణయం కోసం వేచి ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు కోసం టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ బుధవారం ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఇతర సీనియర్ టీవీకే నాయకులు కూడా ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శిని కలిశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాల్లో టీవీకే పార్టీ 108 సీట్లను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 స్థానాలు కావాల్సి ఉంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఇప్పటికే ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతును పొందారు. కానీ తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కును చేరుకోవడానికి ఇంకా ఆరుగురు శాసనసభ్యుల మద్దతు అవసరం ఉంది.


## హార్ముజ్‌పై అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం



ప్రపంచ దేశాలకు ఇదో గుడ్ న్యూస్. కొద్ది రోజులుగా మూసి ఉన్న హార్ముజ్ జలసంధి త్వరలోనే తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం.. హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై గురువారం రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్ముజ్‌ను వీలైనంత త్వరగా, దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే హార్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని కూడా ప్రయాణించేందుకు అనుమతివ్వనున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి హార్ముజ్ మూసి ఉన్న సంగతి తెలిసిందే. మధ్యలో కొన్ని గంటలు మాత్రమే హార్ముజ్‌ను ఇరాన్ ఓపెన్ చేసింది. ఆ తర్వాత వెంటనే తిరిగి మూసేసింది. అనంతరం అమెరికా కూడా ఈ జలసంధిని దిగ్బంధించింది. ఈ మధ్య కాలంలో కొన్ని నౌకలకు మాత్రం అనుమతి లభించింది. ఇక, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని విడిపించేందుకు అమెరికా ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాణిజ్య నౌకలకు రక్షణగా, అమెరికా యుద్ధ విమానాల్ని మోహరించాలనుకుంది. కానీ, ఇరాన్‌తో చర్చల్లో ముందడుగు పడటంతో ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ఆపేస్తున్నట్లు అమెరికా తెలిపింది. మరోవైపు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హార్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తే అంతర్జాతీయంగా చమురు అందుబాటులోకి వస్తుంది.

## హార్ముజ్ జలసంధి దాటిన 11భారత నౌకలు..

ఇరాన్--అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హార్ముజ్ జలసంధిని మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో జలసంధిలో చిక్కుకుపోయిన భారత నౌకలపై కేంద్ర విదేశాంగ శాఖ ఒక



ప్రకటన చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ప్రకటన చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 11 భారత నౌకలు జలసంధిని దాటాయని ఆయన వెల్లడించారు. ఇంకా 13 నౌకలు పర్షియన్ గల్ఫ్ వద్ద చిక్కుకుపోయినట్లు తెలిపారు. మిగిలిన నౌకలు తిరిగి ఇండియా సురక్షితంగా చేరేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు జైశ్వాల్ చెప్పారు. ఈ విషయంలో ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపుల తర్వాత ఇండియా ఈ అంశంలో ముందడుగు స్థితిలోనే ఉందన్నారు. 11 నౌకలు హార్ముజ్ నుంచి సురక్షితంగా ఇండియా చేరాయన్నారు. మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ చమురు రవాణాకు సంబంధించి హార్ముజ్ జలసంధి అత్యంత కీలకం అనే సంగతి తెలిసిందే. హార్ముజ్ మూసివేయడంతో అనేక దేశాలు చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఇండియా సహా అనేక దేశాలు ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం అనేక దేశాలకు చెందిన నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయి.

తీన్మార్
నేటి వాస్తవాల... తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ పునరాగమనం

దక్షిణాదిలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నది. ఇప్పటికే కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారాన్ని దక్కించుకున్న హస్తం పార్టీ, ఇప్పుడు కేరళలోనూ జైత్రయాత్రను కొనసాగించింది. రెండేండ్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకుంటూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటకలో మొత్తం 224 స్థానాలకుగాను కాంగ్రెస్ ఏకంగా 135 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ బీజేపీని కేవలం 66 స్థానాలకే పరిమితం చేసి తన సత్తా చాటింది. తెలంగాణలోనూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు బ్రేక్ వేస్తూ కాంగ్రెస్ సంచలన విజయం సాధించింది. మొత్తం 119 స్థానాల్లో కాం గ్రెస్ 65 స్థానాలను గెలుచుకొని రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారాన్ని చేజిక్కించుకుంది. కర్నాటక, తెలంగాణ తర్వాత ఇప్పుడు కేరళలోనూ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలే స్తున్నది. ఈ విజయంతో దక్షిణాదిలో ప్రధాన రాష్ట్రాలన్నీ ఇప్పుడు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.తాజాగా.. వెలువడిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభంజనం సృష్టించింది. దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) పాలనకు చరమగీతం పాడుతూ, కేరళ ఓటర్లు యూడీఎఫ్ వైపు మొగ్గు చూపారు.మొత్తం 140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో, యూడీఎఫ్ 102 స్థానాల్లో విజయం సాధించి స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. ఇందులో ఒక్క కాంగ్రెస్ పార్టీయే 63 స్థానాలను గెలుచుకోవడం విశేషం. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకే పరిమితమైంది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పశ్చిమ బెంగాల్, అస్సాంలలో బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టి ఉండవచ్చు. కానీ ఈ గణాంకాల వెనుక భారత రాజకీయ గమనాన్ని మార్చగల ఒక లోతైన కథ దాగి ఉంది. అది 'కాంగ్రెస్ పార్టీ పునరాగమనం'. పైకి ఓటమిలా కనిపిస్తున్నా, వ్యూహాత్మకంగా చూస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే అతిపెద్ద రాజకీయ లబ్ధిదారుగా అవతరించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మలబార్ రీజియన్‌లో ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తో కలిసి కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది.క్షిణ భారతదేశం కాంగ్రెస్ ఒక అభేద్యమైన కంచుకోట అని, ఇక్కడ బీజేపీ గడ్డు రాజకీయ పరిస్థితులను ఎదుర్కొంటోందని కేరళ ఫలితాలు మరోసారి నిరూపిస్తున్నాయి. ఈ విధంగా దక్షిణాన కర్ణాటక, తెలంగాణల తర్వాత కేరళలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడనుంది. నిజానికి కేరళలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల చరిష్మా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత రాష్రాన్ని కాంగ్రెస్‌కు సురక్షిత ప్రాంతంగా మార్చాయి. కర్ణాటక, తెలంగాణ తర్వాత కేరళలోనూ గెలవడంతో దక్షిణ భారతదేశంలో కాంగ్రెస్ ఒక తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఇక్కడ బీజేపీ ఎంత ప్రయత్నించినప్పటికీ, తన స్థానాలను పెంచుకోలేకపోయింది.2021లో బెంగాల్‌లో కాంగ్రెస్ రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగు అయ్యింది. కానీ ఈ దఫా జరిగిన ఎన్నికల్లో బెంగాల్‌లో కాంగ్రెస్ 3% ఓట్ల వాటాను సంపాదించి, రెండు సీట్లను కూడా గెలుచుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ బలహీనపడటం కాంగ్రెస్‌కు వరంగా మారింది. టీఎంసీ పతనం తర్వాత ఏర్పడిన ప్రతిపక్ష శూన్యతను పూరించడానికి లౌకికవాద ఓటర్లు మళ్లీ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇక్కడ పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత 15 ఏళ్లుగా మమతా బెనర్జీతో సంబంధం ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతంలో తన రాజకీయ పట్టును బలపరుచుకునేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు అవకాశం ఉంది. బెంగాల్‌లో అధికార మార్పిడి భవిష్యత్తులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీకి దారితీయవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక తమిళనాడులో నిజానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ద్రావిడ రాజకీయ పార్టీల కారణంగానే అధికారం కోల్పోయి, తిరిగి రాలేక కేవలం ఒక 'జూనియర్ భాగస్వామి'గా మిగిలిపోయింది. కానీ ఇప్పుడు విజయ్ పార్టీ గెలుపు, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి టీవీకేకు కాంగ్రెస్ అవసరం ఏర్పడటం చూస్తుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అస్సాంలో మైనారిటీ ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. బద్రుద్దీన్ అజ్మల్ ఓటమి అస్సాం భవిష్యత్ రాజకీయాలను ద్విముఖంగా మార్చేసింది. ఇప్పుడు బీజేపీకి ఓట్లను చీల్చే పార్టీలు ఏవీ మిగలకపోవడంతో, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అధికార పీఠం సులువుగా చేజిక్కించుకునే మార్గం కనిపిస్తోంది. ఐదు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలు మమతా బెనర్జీ, స్టాలిన్, బద్రుద్దీన్ అజ్మల్ వంటి నాయకులను బలహీనపరిచి, ప్రతిపక్ష "ఇండియా" కూటమిలో కాంగ్రెస్‌ను అత్యంత శక్తివంతమైన పాత్రలో నిలబెట్టాయి. గత కొన్ని దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకే బలంగా ఉండటం కాంగ్రెస్‌కు అతిపెద్ద సమస్యగా ఉండేది. ఈ 2026 ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా ఒక కొత్త "అవకాశాన్ని" కల్పించాయని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ 'సాంస్కృతిక జాతీయవాదం'కు వ్యతిరేకంగా 'రాజ్యాంగ జాతీయవాదం'ను నిలబెట్టి ఓట్లు గెలుచుకోగలమని నిరూపించుకోవడానికి కాంగ్రెస్‌కు ఒక అవకాశం లభించిందని అంటున్నారు.2026 ఎన్నికల ఫలితాలు బీజేపీకి అధికారాన్ని ఇవ్వడంతో పాటు, కాంగ్రెస్‌కు ఒక ఆశాకిరణాన్ని కూడా అందించాయి. ఇకపై కాంగ్రెస్ కేవలం ఒక పార్టీ మాత్రమే కాదని, బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక శక్తి అని నిరూపించుకుంది.

# నిర్వీర్యపరిచే ఆదేశాలు!

కొన్ని ఉదంతాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. వింటున్నది నిజమేనా అనిపిస్తాయి. ఒరిస్సా హైకోర్టు కొన్ని బెయిల్ దరఖాస్తుల విషయంలో వెలువరించిన ఆదేశాలు అటువంటివే. నిరుడు ఏప్రిల్--సెప్టెంబర్‌ల మధ్య ఆ హైకోర్టు 50 బెయిల్ దరఖాస్తుల్ని అంగీకరించింది. కానీ అందుకు సంబంధించి విధించిన షరతులు అందరినీ నివ్వెరపరిచాయి. ఆ నిందితులంతా రెండు నెలలపాటు పోలీస్‌స్టేషన్లు, గుడులు, ఆసుపత్రులు, గ్రామీణ రహదారులు, చెరువులు ప్రతిరోజూ ఉదయం మూడు గంటలపాటు శుభ్రం చేయాలన్నది వాటి సారాంశం. మైనింగ్ కార్యకలాపాలు నిలిపేయాలంటూ ఉద్యమించిన వారితోపాటు దొంగతనం, హత్య తదితర క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. నిందితుల్లో అత్యధికులు దళిత, ఆదివాసీ వర్గాలకు చెందినవారు కావటం గమనించదగ్గది. ఇలాంటి పారిశుద్ధ్య పనుల కేటాయింపులో న్యాయమూర్తి కులం కోణాన్ని మించి చూడలేకపోయారని ఈ బెయిల్ ఆదేశాలు తేటతెల్లం చేస్తున్నాయి. సాధారణంగా సామాజిక ఉద్యమకారులెవరైనా ఫిర్యాదు చేస్తేనే ఇలాంటి ఉదంతాలు న్యాయస్థానం దృష్టికి పోతాయి. కానీ 'ఆర్టికల్ 14' అనే డిజిటల్ మీడియాలో గత నెల 27న వచ్చిన కథనాలను సర్వోన్నత న్యాయస్థానం తనంత తానే గమనించటం, ఆ షరతులు చెల్లబోవని వెనువెంటనే ఉత్తర్వులీయటం కొంతలో కొంత ఊరట.

'కులం పునాదుల మీద మీరు దేన్నీ సాధించలేరు. ఒక జాతినీ నిర్మించలేరు. ఒక నీతినీ నిర్మించలేరు' అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్. వచ్చే ఏడాదితో మన దేశం స్వాతంత్ర్యాన్ని సాధించుకుని ఎనభైయ్యేళ్లవుతుంది. కానీ దళితులకు, ఇతర అట్టడుగు వర్గాలకూ అడుగడుగునా కులవివక్ష ఎదురవుతూనే ఉంది. కేలండర్లు మారుతున్నా, సాంకేతికత విస్తరించి అభివృద్ధి జరుగుతున్నా ఆ మనస్తత్వం మారటం లేదు. కుల వివక్ష, దానిపేరిట సాగుతున్న హింస దేశాభివృద్ధికే ఆటంకంగా ఉన్నదనీ, అది మనుషులను వేరు చేస్తోందనీ, మనసుల్ని సంకుచితపరుస్తోందనీ స్వామి వివేకానంద ఏనాడో ఆందోళన వ్యక్తం చేశారు. కానీ మార్పు ఎక్కడ?

ఇతర వ్యవస్థల్లో ఇలాంటి జాడ్యాలు కనబడినప్పుడు సరిదిద్దాల్సిన న్యాయవ్యవస్థ సైతం ఆ తానులో ముక్కగా మారితే...? ఒరిస్సా హైకోర్టు ఆదేశాలు చూసి రాయగడ



అదనపు సెషన్స్ న్యాయస్థానం, మరో ఆరు కింది కోర్టులు ఈ మాదిరి ఆదేశాలే జారీ చేశాయి. 'ఒడిశా న్యాయవ్యవస్థ వ్యక్తీకరించిన ఈ తిరోగమన మనస్తత్వం మమ్మల్నెంతో కలవరపరుస్తోంది. ఇది మానవ హక్కుల్ని ఉల్లంఘించటమేకాక నిందితుల గౌరవాన్ని దెబ్బతీసే చర్య' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జయ్‌మాలా బాగ్చీ ఆధ్వర్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్మొహమాటంగా తెలిపింది. విచారణకు ముందే నేరం చేసినట్టు నిర్ణయానికొచ్చి 'శిక్షించటం' అమల్లోవున్న చట్టాల ప్రకారం చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది.

బాక్సైట్ మైనింగ్ కోసం వేదాంత గ్రూప్ సంస్థలకు రాయగడ, కలహండి జిల్లాల్లో ఇచ్చిన లీజులవల్ల తూర్పు కనుమల్లోని 1560.40 హెక్టార్ల అటవీభూమి నాశనం కాబోతోంది. రెండు జిల్లాల్లోని రెండు గ్రామాలు అదృశ్యమవుతాయి. ఆదివాసీ, దళిత వర్గాలు ఈ లీజుల రద్దుకు 2023 నుంచి ఉద్యమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014--19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం సైతం విశాఖ ఏజెన్సీలో ఇలాగే లీజుకీయటం, ఉద్యమాలు చెలరేగటం ఎవరూ మరిచిపోరు. అటు తర్వాత వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ అనుమతుల్ని రద్దు చేసింది. ప్రకృతి విధ్వంసానికి దారితీసే, స్థానికుల జీవికను దెబ్బతీసే ఇలాంటి చర్యను ఒడిశా సర్కారు విరమించుకోకపోగా, ఉద్యమకారుల్ని నిర్బంధిస్తోంది. సకాలంలో జోక్యం చేసుకోకుండా వ్యవస్థలు నిర్లిప్తంగా మిగిలితే ఉద్యమాలు హింసాత్మక రూపం ధరిస్తాయి. వాటిని ప్రభుత్వాలు శాంతిభద్రతల సమస్యగా పరిగణించి అణచటానికి చూస్తాయి. నక్సలైటు ఉద్యమాల తీవ్రత, పర్యవసానాలు చూశాకైనా ఈ పోకడలు మానుకొని, స్థానికుల ఆకాంక్షల్ని గౌరవించే సంస్కృతిని వ్యవస్థలు అలవర్చుకోవాలి. ఈ విషయంలో ఒరిస్సా హైకోర్టు తీరు ఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యపట్ల సుప్రీంకోర్టు ప్రదర్శించిన అప్రమత్తత, దిద్దుబాటు చర్యలు నిస్సహాయ పౌరులకు వ్యవస్థలపట్ల విశ్వాసాన్ని పెంచుతాయి.

# ఇరాన్ యుద్ధం ప్రపంచానికి హెచ్చరిక

కేవలం తన మాట వినటం లేదని ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని, అతని కుటుంబాన్ని దారుణంగా హతమార్చాడు అమెరికా అధ్యక్షుడు! తన చెప్పు చేతుల్లో ఉండేవాణ్ణి ఇరాన్‌కు అధ్యక్షుణ్ణి చేయలేదన్న కసితో సవాల్ చేసి మరీ ఇరాన్‌ను తగలబెడుతున్నాడు ట్రంప్. అయినా సరే ఆ గ్లోబల్ రౌడీని అడ్డుకోవడం కాదు కదా కనీసం ప్రశ్నించలేకపోతున్నాయి ప్రపంచ దేశాలు. ఐరాస కూడా కిమ్మనడం లేదు. దీన్నిబట్టి ప్రపంచం ఎంతటి ప్రమాదంలో ఉందో తెలుస్తున్నది. భారత్‌లో అత్యధిక సంపద అదానీ, అంబానీ, వేదాంత వగైరాల వద్ద పోగుపడినట్టే అమెరికాలోని అత్యధిక సంపద ఆయుధ, ఆయిల్ వ్యాపారుల వద్ద పోగుపడటం తెలిసిందే. ఆ బడా కార్పొరేట్లు రాజకీయాన్ని 'డబ్బుతో అధికారం-అధికారంతో డబ్బు' అనే చట్రంలో ఇరికించేశారు. ఎలాగంటే తమ ధన ప్రవాహం, మీడియా ప్రచారాలతో తమ లాభాల కోసం పనిచేసే పార్టీ నేతను గెలిపించుకోవడం, వాళ్ల ద్వారా తమ లాభాలను, సంపదను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడం.. ఇదే వాళ్లు రూపొందించుకున్న రాజకీయ ఆర్థిక రహదారి. భారతీయ బడా కార్పొరేట్లు, వాళ్ల చెప్పుచేతల్లోని మీడియాబీజేపీ నాయకుడు మోదీని గెలిపించుకున్నట్టే అమెరికన్ ఆయుధ, ఆయిల్ వ్యాపారులు రిపబ్లికన్ ట్రంప్‌ను గెలిపించుకున్నారు. వాళ్లు అమెరికా అధ్యక్షునికి నిర్దేశించిన కర్తవ్యాలు రెండు. ఒకటి, ఆయుధ వ్యాపారుల ఆయుధాలను విరివిగా అమ్మి పెట్టడం. రెండు, ఆయిల్ వ్యాపారులకు గల్ఫ్ దేశాల నుంచి కారుచౌకగా ఆయిల్ కొనిపెట్టడం. అందుకే ప్రపంచ దేశాల మధ్య తరచూ యుద్ధాలను ప్రేరేపిస్తూ, ఆ దేశాలకు ఆయుధాలు అమ్మటం అమెరికా అధ్యక్షుని విధుల్లో ఒకటిగా మారింది. ఉదాహరణకు, గతంలో పాక్‌ను భారత్‌పై ఉసిగొల్పి, రెండు దేశాలకూ ఆయుధాలు అమ్మింది అమెరికా. ఇటీవల ఉక్రెయిన్‌ను రష్యాపైకి, ఇజ్రాయిల్‌ను పాలస్తీనా పైకి ఉసిగొలిపి, ఆ రెండు దేశాలకు అమెరికా భారీగా ఆయుధాలు అమ్మడం తెలిసిందే. అన్య దేశాల యుద్ధాలకు వీలు కానప్పుడు అమెరికా స్వయంగా మరోదేశంపై దాడి చేసి ప్రభుత్వం తరపున ఆయుధాలను కొంటుంటాడు అమెరికా అధ్యక్షుడు. కేవలం ఆయుధాలకు కొనుగోలు కోసమే అకారణంగా ఇరాన్‌పై ట్రంప్ యుద్ధానికి దిగటమే అందుకు నిలువెత్తు నిదర్శనం. అమెరికన్ ఆయిల్ వ్యాపారుల కోసం మధ్యప్రాచ్య దేశాల నుండి కారు చౌకగా చమురును కొల్లగొట్టేందుకు అమెరికా చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ




కావు. ప్రస్తుతం ట్రంప్ లక్ష్యాలు రెండు. ఒకటి, మధ్యప్రాచ్యంలో ప్రవేశానికి ముఖద్వారం వంటి ఇజ్రాయిల్‌ను మరింత బలోపేతం చేసి దానితో పాలస్తీనాను దురాక్రమింపజేసి, గ్రేటర్ ఇజ్రాయిల్ రూ పొందించడం. రెండు, తమ చమురు దోపిడీకి సహకరించని, పరోక్షంగా పాలస్తీనా దురాక్రమణకు అడ్డుపడుతు న్న ఇరాన్‌ను అణచేయడం. ఈ రెండు లక్ష్యాలు నెరవేరితే తమ చమురు దోపిడీకి ఎదురు ఉండదన్నది అమెరికా ఆంతర్యం. ఈ దురుద్దేశం, దురాలోచనలతోనే ఇరాన్ చుట్టూ ఉన్న అరబ్ దేశాలను లోబరుచుకొని 18 సైనిక స్థావరాలతో పొంచి ఉన్నది అమెరికా. రష్యా, ఇరాన్‌లు భారత్‌కు చిరకాల, విశ్వసనీయ మిత్రదేశాలు. ఉదాహరణకు, 1) హీరాకుడ్, బాక్రానంగల్ వంటి భారీ ఆనకట్టలకు, భిలాయి, రూర్కెలా ఉక్కు కర్మాగారాలకు ఆర్థిక, సాంకేతిక సాయం అందించిన ఆత్మీయ మిత్ర దేశం రష్యా. 2) బంగ్లాదేశ్ అవతరణ సమయాన పాకిస్థాన్‌కు మద్దతుగా భారత్ పైకి దూసుకొచ్చింది అమెరికా. అప్పుడు భారత్‌కు నేనున్నానంటూ ముందుకొచ్చింది రష్యా. తోకముడిచింది అమెరికా. దటీజ్ రష్యా. 3) అలాగే కాశ్మీర్ విషయంలో ప్రపంచ ముస్లిం దేశాలు పాక్‌కు మద్దతిస్తుంటే కాశ్మీర్ భారత అంతర్భాగం అంటూ ఘంటాపథంగా ప్రకటించిన ఏకైక ముస్లిం దేశం ఇరాన్. 4) క్లిష్ట సమయాల్లో డాలర్లు లేకున్నా రూపాయి మారకానికే భారత్‌కు చమురు అందించిన ఆత్మీయ దేశం ఇరాన్. జాతీయ నిఘా వ్యవస్థల ద్వారా ప్రతిపక్ష పార్టీల నేతల రహస్యాలను రికార్డు చేయించటం ద్వారా మోదీ వాళ్లను శాసించగలుగుతున్నట్టే అంతర్జాతీయ నిఘా వ్యవస్థల ద్వారా ఆయా దేశాల రహస్యాలను సమీకరించటం ద్వారా మోదీ వంటి దిగ్గజ నేతలను కూడా నోరు ఎత్తడానికే భయపడేలా చేయగలుగు తున్నారు ట్రంప్, నెతన్యాహూలు. అంతేకాదు తమకు కొరుకుడు పడని ఏ దేశాధినేతనైనా వాళ్ల స్వదేశంలోనే హతమార్చ గలిగే భయంకర విధ్వంసకారులయ్యారు ట్రంప్ నెతన్యాహూలు. అయితే ఈ పాపము కేవలం వాళ్లదే కాదు. వాళ్లని అలాంటి అనివార్య దుస్థితికి నెట్టేసిన ఆయుధ, ఆయిల్ బడా కార్పొరేట్లది కూడా. అభినవ ముసోలిని, హిట్లర్‌లా వ్యవహరిస్తున్న నెతన్యాహూ, ట్రంప్‌లు భీకర విధ్వంసాలకు పాల్పడుతూ ప్రపంచ ప్రజల చేత ద్వేషింపబడుతున్నారు. ఈ అనివార్య దుస్థితికి నెట్టివేయబడటం వెనుక ఉన్న హెచ్చరిక ఒకటే. దేశాధినేతలు ధనాన్ని కొద్ది మంది వద్ద కేంద్రీకరించే కార్పొరేటీకరణ దిశగా పాలన కొనసాగించడం సరికాదు. అలా చేస్తే బడా కార్పొరేట్లు అకారణ యుద్ధాలకు, విధ్వంసాలకు పాల్పడక తప్పని దుస్థితికి దేశాన్ని నెట్టేస్తారు.

## మే 17 తర్వాతే సౌత్ కు నైరుతి రుతుపవనాలు

**చెన్నై :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇటీవలే వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. మే 17న రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకుతాయని వెల్లడించింది. దీంతో ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ క్రమంలో తాజాగా ఐఎండీ మరో షాకింగ్ విషయం తెలిపింది. తూర్పు, మధ్య పసిఫిక్ ఉపరితల జల ఉష్ణోగ్రతల్లో కొంత సమయం తటస్థ స్థితిలో ఉన్న తర్వాత ఇప్పుడు అవి ఎల్‌నినో సూచక స్థాయి దిశలో కదలడంతో ప్రపంచ వాతావరణ సంస్థలు ఎల్‌నినో ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మార్పులు గత తటస్థ కాలంతో పోలిస్తే సముద్ర వాతావరణంలో శక్తి విడుదల, గాలుల నమూనాల్లో మార్పులకు దారి తీస్తాయి. ఇన్కాయిస్ ప్రక్రియలో ఈ ఏడాది ఏప్రిల్‌లో వరకు సాధారణ పరిస్థితులు కొనసాగాయని, తాజా డేటా ఆధారంగా ఎల్‌నినో దశలోకి మారినట్లు ప్రకటించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు స్థిరంగా కొనసాగొచ్చని బులిటెన్ విడుదల చేసింది.పసిఫిక్ జల ఉష్ణోగ్రతలను పరిశీలించేందుకు ఇన్కాయిస్ ప్రత్యేక డీప్ లెర్నింగ్ మోడల్ బేయేసియన్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఈ మోడల్ గత ఎల్‌నినో, లా నినా నమూనాలతోపాటు ఇప్పటి డేటాను కలిపి భవిష్యత్ పరిస్థితులను విశ్లేషిస్తుంది. ఇది వచ్చే ఎల్‌నినో లేదా లా నినా ప్రక్రియలను సుమారు 24 నెలల ముందుగా అంచనా వేసే సామర్థ్యాన్ని అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇది దేశాలు, వ్యవసాయ, నీటి నిర్వహణ, విద్యుత్ విభాగాలకు ప్రణాళిక రూపకల్పనకు కీలక సాధనంగా మారుతుంది.భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్‌లో ఎల్‌నినో స్థితి ఏర్పడితే, అది భారత నైరుతి రుతుపవనాల ప్రవేశం, బలం, వర్షపాత పంపిణీ మీద గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పలుమార్లు గుర్తించారు. ఈ సందర్భంలో సాధారణ కంటే తక్కువ లేదా అసమంగా వర్షాలు కురుస్తాయి. కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొన్ని అధ్యయనాలు ఈ ఏడాది భారత్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉండొచ్చని, రుతుపవన రాక కొంత ఆలస్యమవుతుందని సూచిస్తున్నాయి. ఇది వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి, ఆహార ధరల వంటి అనేక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

# ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుమతులు తప్పనిసరి

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌ల నిర్వహణ, అనుమతులు, నిబంధనల అమలుపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్ చేయాలని సూచించారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. వైద్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఉన్న లోపాలను గుర్తించి వారికి తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో పరీక్షల ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రతి సంస్థలో రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుమతులు, అర్హత కలిగిన సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండాలని తెలిపారు.



అర్హతలు లేకుండా వైద్యం నిర్వహిస్తున్న ఆర్ఎంపీ వైద్యులపై కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను వెంటనే సీజ్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ వైద్య సేవలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టాన్ని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, గర్భ లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎటువంటి ఉపేక్ష ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్ల రికార్డులు, రిజిస్టర్లు, ఫారమ్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో భాగంగా రెన్యువల్ కోసం వచ్చిన 46 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వైద్యశాఖ అధికారులు చెక్ లిస్ట్ ఆధారంగా అన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, , పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్జీవో ప్రోగ్రామ్ ఆఫీసర్ సంజీవరావు, డాక్టర్ రాందాస్, డాక్టర్ హరీష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగలక్ష్మి, బేబీ హెల్త్ ఎడ్యుకేటర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో మాక్ డ్రిల్స్ స్పందన కీలకం

**డి. హరిచందన ఐఏఎస్, కార్యదర్శి, రెవెన్యూ డి.ఎం**

ములుగు జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో మాక్ డ్రిల్స్ కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రెవెన్యూ విపత్తు నిర్వహణ కార్యదర్శి డి. హరిచందన అన్నారు. మే 15న జరిగే టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్‌కు సంబంధించి వివిధ శాఖల అధికారులు మరియు జిల్లాల యంత్రాంగంతో గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.మే 18న వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌లు జరగనున్నాయి తెలిపారు. 2025లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల నుండి త్వరిత స్పందన మరియు సమన్వయ సేవలను నిర్ధారించడంలో ఎంతో ఉపయోగపడ్డాయని కార్యదర్శి అన్నారు. ఇటువంటి వ్యాయామాలు క్షేత్ర స్థాయిలో లోపాలను గుర్తించడంలో సహాయపడతాయని మరియు శాఖలు క్రమబద్ధమైన పద్ధతిలో ప్రణాళిక మరియు సంసిద్ధతను మెరుగుపరచుకోవడానికి అవకాశం కల్పిస్తాయని ఆమె అన్నారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ మే 18న జరిగే వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌లలో దాదాపు 60 శాఖలు మరియు కేంద్ర ఏజెన్సీలు పాల్గొంటాయని చెప్పారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (చీఐహీూ) సహకారంతో తెలంగాణ 2025 డిసెంబర్‌లో వరదలు మరియు పారిశ్రామిక ప్రమాదాలపై మొదటిసారి మాక్ డ్రిల్స్



నిర్వహించిందని, ఇది అంతర్-శాఖ సంసిద్ధతను మరియు విపత్తులకు త్వరిత స్పందనను గణనీయంగా బలోపేతం చేసిందని ఆయన అన్నారు. 2026 సంవత్సరానికి వరదల సంబంధిత మాక్ డ్రిల్స్ 13 జిల్లాల్లో, పారిశ్రామిక ప్రమాద డ్రిల్స్ ఐదు జిల్లాల్లో మరియు అటవీ అగ్ని మాక్ డ్రిల్స్ నాలుగు జిల్లాల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్సర్‌సైజ్‌ల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అన్ని శాఖలను ఆయన ఆదేశించారు. న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న చీఐహీూ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ శ్రీ సుధీర్ బెహ్ల్ (రిటైర్డ్), వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు మరియు అటవీ అగ్ని పరిస్థితుల సమయంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల పాత్రలు మరియు బాధ్యతలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. 15వ తేదీన టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ మరియు 18న జరిగే రాష్ట్ర స్థాయి మాక్ డ్రిల్స్ ఏర్పాట్లకు సంబంధించి ఆయన అనేక సూచనలు కూడా చేశారు. ఈ ప్రజెంటేషన్‌లో అంతర్-శాఖ సమన్వయం, ప్రణాళిక, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్ మార్గదర్శకాలు, సహాయ శిబిరాల ఏర్పాటు, ఆసుపత్రి సంసిద్ధత, అటవీ అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గూర్చి వివరించడం జరిగింది. ఈ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశపు గది నుంచి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, డి.ఎం.హెచ్.ఓ డా. గోపాలరావు, డి.పి.ఓ వెంకయ్య, డి.ఈ.ఓ సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్.డి.ఆర్.ఎఫ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేను ఆ రోజు బ్రోతల్ కీపర్‌గా వెళ్లా..

**రెండు గంటలు చాలా టెన్షన్ పడ్డా..': మల్కాజిగిరి సీపీ సుమతి**

**హైదరాబాద్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి చేపట్టిన సాహసోపేతమైన స్టింగ్ ఆపరేషన్లు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల అర్ధరాత్రి వేళ సాధారణ మహిళగా రోడ్డుపై నిలబడి వేధింపులకు పాల్పడుతున్న 40 మంది పోకిరీలను పట్టుకున్నారు. గతంలోనూ తన ప్రాణాలకు తెగించి హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాలను ఎలా మట్టుబెట్టారో ఆమె ఓ యూట్యూబ్ ఛానెల్‌తో పంచుకున్నారు. పోలీసు డ్రెస్సులో మాత్రమే కాకుండా.. సాధారణ పౌరురాలిగా మారి నేరస్తుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్న ఈ ఐపీఎస్ అధికారిణి ప్రస్థానం నేటి యువతకు నిజంగా స్ఫూర్తిదాయకం.సీనియర్ ఐపీఎస్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాఫిక్‌గా మారారు. దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ఓ సాధారణ మహిళగా ఆమె స్రీకెట్ ఆపేరషన్ చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా అర్ధరాత్రి రోడ్డుపై నిలబడిన ఆమెను దాదాపు 40 మంది పోకిరీలు వేధింపులకు పాల్పడ్డారు. జుగుప్సకరమైన మాటలతో ఇబ్బందులకు గురి చేశారు. వారందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే సుమతి ఇలా ఫీల్డ్ ఆపరేషన్లు చేపట్టడం ఇదే తొలిసారు కాదు. ఆమె గంతంలోనూ ఇలాగే సీక్రెట్ ఆపేరషన్లు చేపట్టి అమ్మాయిల అక్రమ రవాణా, వేధింపులకు గురి చేస్తున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2004 సమయంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలో అమ్మాయిలను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ఓ ముఠా ఆట కట్టించారు. ఆ రోజు ఏం జరిగింది..? ఎలా ఆ ముఠాను పట్టుకున్నారనే విషయాలను ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అమ్మాయిలతో ట్రాఫికింగ్ చేస్తున్నారన్న సమాచారంతో అప్పట్లో ఓ స్టింగ్ ఆపరేషన్ చేపట్టాం. హైదరాబాద్ నగరంలో చాలా చోట్ల రైడ్ చేశాం. చివరగా.. కూకట్‌పల్లి, చందానగర్ ఏరియాలో మాకు ఓ ఇన్ఫర్మేషన్ దొరికింది. అమ్మాయిలను రొంపిలోకి దింపుతున్న




వాళ్లను పట్టుకునేందుకు నేను కూడా ఓ బ్రోతల్ కీపర్‌లాగా వెళ్లాలనుకున్నా. మేం చేసిన ఆపరేషన్‌లో అదొక భాగం. దీంతో నేను బిజినెస్ చేసేవాళ్ల దగ్గరకు వెళ్లా. వెళ్తూ వెళ్తూ వెపన్ పెట్టుకున్నా. అమ్మాయిలను సప్లయ్ చేసేవాళ్ల ఆటో ఎక్కి కూకట్‌పల్లి నుంచి బయల్దేరాం. అలా వెళ్తున్న క్రమంలో నన్ను ఫాలో అవుతున్న ఇద్దరు ఎస్సైల వెహికల్ మిస్ అయిపోయింది. చివరకు నన్ను ఓ బ్రోకర్ అమ్మాయిలను ట్రాఫికింగ్ చేసే చోటుకు తీసుకెళ్లారు.అక్కడ లావుగా ఉన్న ఉ ముగ్గురు లేడీస్ ఉన్నారు. వారితో మాట్లాడటానికి వచ్చిన మరికొందరు అమ్మాయిల సప్లయర్స్ కూడా ఉన్నారు. ఇది చాలా సినిమాటిక్‌గా ఉంది. నన్ను చూసి వాళ్లకు డౌట్ వచ్చింది. ఇంత యంగ్ ఉంది నిజంగానే బ్రోకరా..? అని సందేహించారు. కానీ నేను వాళ్లను చాలా తెలివిగా నమ్మించాను. నేను ఆర్గనైజర్‌గా అక్కడకు వెళ్లి.. నా దగ్గర 10 మంది అమ్మాయిలు ఉన్నారని చెప్పా. దాంతో వాళ్లలో ఒకడు మీ లోకేషన్ దగ్గరకు తీసుకెళ్లమని బలవంతపెట్టాడు. ఇప్పుడు కాదు..15 రోజుల తర్వాత కాంటాక్ట్ అవుతా అని చెప్పా. అయినా వాళ్లు ఇప్పుడే కాంటాక్ట్ ఇవ్వాలని చెప్పటంతో వారికి అనుమానం రాకుండా వారితో పాటే ఆటోలో ఎక్కి బయల్దేరాం. అలా తిరిగి కూకట్‌పల్లి వరకు వచ్చాం. పోలీసులకు నాకు కాంటాక్ట్ లేదు. సైట్‌లోకి ఎవరూ రాలేదు. దాంతో రెండు నిమిషాల్లో ఫోన్ చేసుకొని వస్తానని సినిమాల్లో చూపించిన మాదిరిగా బురిడీ కొట్టించి మా వాళ్లను అక్కడకు పిలిపించా.అమ్మాయిలను సప్లయ్ చేసే ఆర్గనైజర్లు, ఆ ముఠా సభ్యులు దొరికిపోయారు. కానీ ఆ రెండు గంటలు చాలా టెన్షన్ పడ్డా. ఏ మాత్రం తేడా వచ్చినా.. నేను సేవ్ అవ్వలేను.. డిపార్ట్‌మెంట్ ఇబ్బందుల్లో పడుతుంది. కానీ నా దగ్గర వెపన్ ఉండటమే నా ధైర్యం. అమ్మాయిలు ఏ సమయంలోనైనా ధైర్యంగా ఉండాలి. మనల్ని మనం కాపాడుకునేందుకు ప్రయత్నించాలి. కాలేజీలో చదువుకునే సమయంలో నేను కూడా చాలా సార్లు వేధింపులకు గురయ్యా. కానీ ధైర్యంగా ముందుడుగా వేయాలి. తల్లిదండ్రులు కూడా అమ్మాయిల్లో ధైర్యాన్ని నూరిపోయాలి.' అని సీపీ సుమతి వెల్లడించారు.

## మే 8న జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



హనుమకొండ జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

హనుమకొండలో మే 8వ తేదీన శుక్రవారం నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మంత్రి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు యువతకు అందేలా ఇలాంటి మెగా జాబ్ మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీసెస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, కస్టమర్ కేర్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కోరారు.

## ఈవీఎం గోదాం పరిశీలన

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, నెల వారీగా తనిఖీలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల ఈవీఎం గోదాంను గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం

**క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశుభ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడం కోసం ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిబంధన ప్రకారం కమిటీల ద్వారా మంజూరు చేసి అందించాలని ఇప్పటికే మంజూరు చేసిన వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును అందిస్తూ ఇతర నీటి వనరులను ఏర్పరుచుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రామస్థాయిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు. అంతర్గత రోడ్ల, అభివృద్ధి పనులు పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రతిరోజు ఉదయం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉండాలని, అందుకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో అవినీతి బాగోతం

**సర్పంచ్ వర్సెస్ అధికారి**
**నిరుపేదల రక్తం తాగుతున్న సీఏ**
**చోద్యం చూస్తున్న అధికారులు**
**లోన్ల పేరిట లూటీ.. విచారణకు ఏపీఎం వెనుకంజ**
**ప్రశ్నిస్తే రాజకీయ రంగు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):



గొరికొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రావంచాయతీ పరిధిలో మహిళా సంఘాలకు సీఏగా వ్యవహరిస్తున్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. ప్రతి నెలా ఒక్కో సంఘంలోని ఒక్కో సభ్యురాలి నుంచి రూ. 150, అలాగే బ్యాంకు లోను మంజూరైతే ఏకంగా ఒక్కొక్కరి నుండి రూ. 2000 చొప్పున అక్రమంగా డిమాండ్ చేసి వసూలు చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే లోన్లు రానివ్వకుండా చేస్తామని, పద్ధతి దారుణంగా మారిందని బాధితులైన జవ్వాజి శిరీష, బోరగాని సంధ్యారాణి, తోట సునీత తదితర మహిళలు బహిర్గతం చేశారు. బాధితుల పక్షాన నిలిచిన సర్పంచ్.. ఏపీఎంకు ఫిర్యాదు మహిళల ఆర్థికంగా దోచుకుంటున్న సీఏ తీరుపై బాధితులు గ్రామ సర్పంచ్ జవ్వాజి రమేష్ ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళలు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదుల ఆధారంగా.. సర్పంచ్ నేరుగా ఏపీఎం (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారి) కు సర్పంచ్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సదరు సీఏను తక్షణమే విధుల నుంచి తొలగించాలని, గ్రామ పంచాయతీలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# ముదిరాజ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికై భవనాలు మంజూరు చేయాలి

**ముదిరాజ్ ల రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి**
**మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్**

హనుమకొండ, మే 07 (తీన్మార్ న్యూస్):

ముదిరాజ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం ప్రతి జిల్లా కేంద్రంలో భవనాలు నిర్మించాలని, ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫెస్టో ముదిరాజ్ లను బిసి ఏ రిజర్వేషన్ ను వెంటనే అమలు చేయాలని గురువారం నాడు హైదరాబాద్ మినిస్టర్స్ భవనంలో మెపా ( ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ యువతకు, విద్యార్థులకు స్కిల్ డెవలప్ మెంట్ కోసం నైపుణ్య అభివృద్ధి భవనాలు చేపట్టడం ద్వారా అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుకు దూసుకెళ్తారన్నారు... రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర జనాభా ప్రాతిపదికన అధిక జనాభా కలిగిన ముదిరాజ్ లకు సముచిత ప్రాధాన్యం కల్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, అలాగే నిరుద్యోగ యువతీ యువతకు సాంకేతిక శిక్షణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ముదిరాజ్ విద్యార్థుల సాంకేతిక, వృత్తి విద్యా నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. నైపుణ్యాభివృద్ధి ముదిరాజ్ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఆధునిక శిక్షణ అందించడం ద్వారా వృత్తి నైపుణ్యాలతో సొంతంగా ఉపాధి పొందేలా ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పలు వర్గాల విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా ముదిరాజ్ విద్యార్థులకు కూడా ప్రత్యేక స్కిల్



డెవలప్మెంట్ భవనం మంజూరు చేయాలని, దీనికోసం నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై పశు సంవర్ధక, క్రీడలు మరియు యువజన సర్వీస్ శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ముదిరాజ్ కి వినతి పత్రం అందజేసినారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మెపా అధ్యక్షుడు దుండి అశోక్ ముదిరాజ్, మహబూబాబాద్ పట్టణ అధ్యక్షుడు చొప్పరి ప్రశాంత్,మెపా జిల్లా నాయకులు ఆలేటి ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగన్నపేటలో ప్రజా దర్బార్

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

ములుగు జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):



రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మే 8వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 4.00 గంటలకు ములుగు మండలం జగన్నపేట పీఎంశ్రీ పాఠశాలలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో జగన్నపేట గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, గ్రామ పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# ఇంచెన్‌చెర్వుపల్లిలో "పిల్లల్లో" నైపుణ్యాల వేట






**స్వాగ్రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్**

వెంకటాపూర్, మే 07 (తీన్మార్ న్యూస్)

: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ఇంచెన్‌చెర్వుపల్లి గ్రామంలో పిల్లల సృజనాత్మకతను వెలికితీసేందుకు 'స్వాగ్రామ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "సమ్మర్ క్యాంప్ 2026" ఉత్సాహంగా సాగుతోంది. మే 1వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరం మే 31 వరకు నెల రోజుల పాటు పూర్తిగా ఉచితంగా నిర్వహించబడుతుందని నిర్వాహకులు మర్రి క్రాంతి రెడ్డి వెల్లడించారు. గ్రామంలోని పిల్లలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు కేవలం చదువే కాకుండా డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్పోర్ట్స్ వంటి అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, పిల్లలలో ఆత్మవిశ్వాసం మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు సెల్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా, వారి సమయాన్ని నిర్మాణాత్మకంగా మార్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. గ్రామ అభివృద్ధిపై ఉన్న మక్కువతో, భవిష్యత్తులో ఇంచెన్‌చెర్వుపల్లిలో ఒక లైబ్రరీని, అలాగే యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రకటించారు. చదువుతో పాటు సామాజిక స్పృహ పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో అవసరమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్వాగ్రామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మర్రి క్రాంతి రెడ్డితో పాటు డైరెక్టర్లు ఉప్పునుతుల రాజు, సపవత్ వికాస్, భూక్య మోతిలాల్ పాల్గొన్నారు. అలాగే సంస్థ ప్రతినిధులు ఎడ్ల చిరంజీవి, కామ వెంకటేష్, చెవుల శ్రీకాంత్, దూరిశెట్టి విజయ్, సపవత్ శివరామరాజు మరియు స్థానిక ఉపాధ్యాయులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమ విజయానికి సహకరించారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి**

ములుగు జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్)



జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని, 10వ తేదీలోగా ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు, గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్ హాజరు, సి ఎం ఎం ఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్.జి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి పి ఓ ప్రకాష్, ఎస్ ఓ లాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



వరంగల్ జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాబ్ మేళా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 కంపెనీలు ఉద్యోగ అవకాశాల కల్పనకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాళోజి కళాక్షేత్రం వేదికగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై.వి. గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రమేష్, జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, మెప్మా రేణుక తదితర అధికారులు పాల్గొన్నారు.

## తమిళనాడు ప్రజలు టీవీకేకు ఇచ్చిన తీర్పును గవర్నర్ అగౌరవపరుస్తున్నారు

**రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న గవర్నర్**
**తమిళనాడు గవర్నర్ తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తి**

**హైద్రాబాద్ :** తమిళనాడు ప్రజలు టీవీకేకు ఇచ్చిన తీర్పును గవర్నర్ అగౌరవపరుస్తున్నారు రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న గవర్నర్ ? ప్రజాతీర్పును గౌరవించి తీరాలనిటీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారుగాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం దురదృష్టకరం గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేట్లు ఉంది గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయని అనుమానాలు కలుగుతున్నాయిసింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్, బొమ్మై కేసు సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయి గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా ? లేక రాజ్యాంగానికి వ్యతిరేఖంగా ప్రవర్తించాలని ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా? తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోంది ? 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన మార్పును అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందికాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం గవర్నర్ కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు ? కుట్ర రాజకీయాల్లో భాగమే విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టిచేతులతో తిరిగిరావడం చూస్తే ? గవర్నర్ రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోంది రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామమాత్రమే ? విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం అని విమర్శించారు. కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే ? వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి ? దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదం అని అన్నారు.

## జూన్ 8న హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఏటా ఇచ్చే చేప ప్రసాదం పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన బత్తిని కుటుంబం ఈ మందును పంపిణీ చేయనుంది. ఆస్తమా, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా భారీగా జనం వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.చేప మందు పంపిణీ కార్యక్రమం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనుంది. మృగశిర కార్తె సందర్భంగా బత్తిని హరినాథ్ గౌడ్ వారసులు ఈ సేవను అందిస్తారు. వేలాది మంది వచ్చే అవకాశం ఉన్నందున ఎగ్జిబిషన్ మైదానంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రసాదం కోసం వచ్చే వారు ముందుగానే వేదిక వద్దకు చేరుకోవడం మంచిది.దశాబ్దాల కాలంగా బత్తిని కుటుంబ సభ్యులు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దీనిని తీసుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా జనం వస్తుంటారు. ప్రభుత్వం కూడా భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. జూన్ 8న ఉదయం నుంచే పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది.

## మే 8వ తేదీన జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి**

ములుగు జిల్లా, మే 07 (తీన్మార్ న్యూస్):

మే 8వ తేదీన శుక్రవారం రోజున హనుమకొండ కాళోజి కళాక్షేత్రంలో జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లా మెగా జాబ్ మేళాను ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఉత్తీర్ణత సాధించిన ములుగు జిల్లా యువతీ యువకులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ సెక్టార్, కస్టమర్ కేర్ సర్వీస్, హాస్పిటాలిటీ, తదితర రంగాలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కలవని పేర్కొన్నారు.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యా అర్హత ఇతర ధ్రువీకరణ పత్రాలతో నేరుగా మెగా జాబ్ మేళాకు హాజర అవ్వాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# బిజినెస్

## గంటల వ్యవధిలో మారిపోయిన బంగారం ధరలు!



మే 2026 ప్రారంభం నుంచి తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు.. మళ్లీ పెరుగుదల దిశగా అడుగులు వేసాయి. ఈ రోజు 24 గంటల వ్యవధిలోనే గోల్డ్ ధరలు మరోమారు ఎగబాకాయికి. దీంతో దేశంలోని ప్రధాన నగరాలలో పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో లేటెస్ట్ గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో వివరంగా తెలుసుకుందాం.

శుక్రవారం ఉదయం హైదరాబాద్, విజయవాడలలో 1,39,750 రూపాయల వద్ద ఉన్న 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు.. సాయంత్రానికి 1,40,250 వద్దకు చేరాయి. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 1,52,460 నుంచి 1,53,000 రూపాయల వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే 24 గంటలు గడవకముందే పసిడి ధరల్లో ఎంత మార్పు జరిగిందో స్పష్టంగా తెలుస్తోంది. ఢిల్లీలో కూడా బంగారం ధరల్లో స్వల్ప మార్పులు జరిగాయి. దీంతో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1,53,150 వద్దకు, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,400 వద్దకు చేరింది. అయితే చెన్నైలో మాత్రం ధరలు కేవలం తులం మీద 10 రూపాయలు మాత్రమే తగ్గింది. దీంతో ఇక్కడ బంగారం ధరల్లో చెప్పుకోదగ్గ మార్పు కనిపించలేదు.

## హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్ఆర్ తగ్గింపు




న్యూఢిల్లీ, మే 7: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎంపిక చేసిన రుణాలపై ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్)ను స్వల్పంగా తగ్గించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో నెల కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.10 శాతం నుంచి 8.05 శాతానికి దిగిరానుండగా, మూడు నెలల రుణాలపై రేటు 8.20 శాతం నుంచి 8.15 శాతానికి, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటును 8.35 శాతం నుంచి 8.30 శాతానికి దించింది. మరోవైపు, ఏడాది, రెండేండ్ల కాలపరిమితితో కూడిన రుణాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. కానీ, మూడేండ్ల కాలపరిమితితో కూడిన రుణాలపై వడ్డీరేటును 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రుణ రేటు 8.55 శాతం నుంచి 8.60 శాతానికి చేరుకున్నది. ఈ నూతన రేట్లు గురువారం నుంచి అమలులోకి వచ్చాయి. డిపాజిటర్లకు బ్యాంక్ గుడ్‌న్యూస్‌ను అందించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు పెంచింది. ప్రస్తుతం డిపాజిట్లపై 2.75 శాతం నుంచి 6.50 శాతం లోపు వడ్డీని ఆఫర్ చేస్తుండగా, సీనియర్ సిటిజన్లకు 3.25 శాతం నుంచి 7 శాతం లోపు ఆఫర్ చేస్తున్నది. వీటితోపాటు మూడేండ్ల నుంచి 4 ఏండ్లు 7 నెలల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు సవరించడంతో వడ్డీరేటు 6.40 శాతం నుంచి 6.50 శాతానికి చేరుకున్నది.

# స్కైరూట్ @ 1.1 బిలియన్ డాలర్లు


యునికార్న్‌గా అవతరించిన హైదరాబాదీ టెక్ కంపెనీ



న్యూఢిల్లీ, మే 7: హైదరాబాద్ ఆధారిత స్పేస్ టెక్నాలజీ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ యునికార్న్‌గా అవతరించింది. దేశంలోనే తమది తొలి స్పేస్-టెక్ యునికార్న్ అని గురువారం ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. ఇటీవల సమీకరించిన దాదాపు 60 మిలియన్ డాలర్లతో తమ సంస్థ విలువ 1.1 బిలియన్ డాలర్లకు చేరిందని పేర్కొన్నాయి.

కంపెనీ వాల్యూ బిలియన్ డాలర్లు దాటితే దానిని యూనికార్న్‌గా పరిగణిస్తారన్న విషయం తెలిసిందే. కాగా, షెర్పలో వెంచర్స్, సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ, గ్రీన్‌కో గ్రూప్ వ్యవస్థాపకులు, అర్కమ్ వెంచర్స్ మరికొన్ని సంస్థల నుంచి ఫండింగ్ పొందినట్టు ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వివరించింది. కాగా, అంతరిక్షంలోకి వెళ్లడం ఇప్పుడు మన ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటని, స్కైరూట్ ఆ సవాళ్లను అధిగమించేందుకు చక్కని మార్గాలను నిర్మిస్తున్నదని, భవిష్యత్తులో ఈ పరిశ్రమలో అద్భుత విజయాలు ఖాయమన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా షెర్పలో వెంచర్స్ వ్యవస్థాపకుడు రామ్ శ్రీరామ్ ఓ ప్రకటనలో వ్యక్తం చేశారు. ఇక విక్రమ్-1 ప్రయోగానికి సిద్ధమవుతున్న నేపథ్యంలోనే స్కైరూట్ తాజా ఫండింగ్‌కు దిగింది. విక్రమ్-1.. భారత్‌లో ఓ ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన తొలి రాకెట్ కావడం విశేషం. గ్లోబల్ శాటిలైట్ కార్యకలాపాల కోసం అంతరిక్షంలోకి పంపడానికి దీన్ని రూపొందించారు. ఇదిలావుంటే విక్రమ్-1 ప్రయోగానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నామని ఈ సందర్భంగా స్కైరూట్ సీఈవో, ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన పవన్ కుమార్ చందన ఓ ప్రకటనలో అన్నారు. అలాగే ఈ ప్రయోగాన్ని ఇటు భారత్‌కు, అటు ప్రపంచ అంతరిక్ష రంగానికి కీలక మైలురాయిగా అభివర్ణించారు. అంతేగాక ముమ్మందు తమ కంపెనీలోకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు రాగలవన్న విశ్వాసాన్ని సైతం కనబర్చారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్





అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా.. పదేళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే.. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా.. బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా.. వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

# లఖ్‌నవూ గెలిచింది




ప్లేఆఫ్స్ ఆశలు దాదాపుగా లేనట్లే.. అన్నీ గెలిచినా ముందుకెళ్తుందన్న గ్యారంటీ లేదు.. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో పరాజయంపాలైంది. అలాంటి జట్టు ఐపీఎల్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడిస్తుందా? గెలుపు సహజంగా ఆర్సీబీదే అని అంతా అనుకున్నారు.. కానీ ఎవరూ ఊహించని విధంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాన్ని అందుకుంది. మిచెల్ మార్ష్ సెంచరీతో మెరిసిన వేళ విజయం సొంతం చేసుకున్న లఖ్‌నవూ సాంకేతికంగా ఇంకా ప్లేఆఫ్స్ రేసులో నిలిచింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కాస్త ఉపశమనం. వరుస ఓటములతో తల్లడిల్లిన ఆ జట్టు ఎట్టకేలకు విజయాన్నందుకుంది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. మిచెల్ మార్ష్ (111; 56 బంతుల్లో 9x4, 9x6) మెరుపు శతకం బాదడంతో మొదట లఖ్‌నవూ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. పూరన్ (38; 23 బంతుల్లో 4x4, 1x6), పంత్ (32 నాటౌట్; 10 బంతుల్లో 4x4, 2x6) రాణించారు. డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 213 పరుగులకు సవరించగా ఛేదనలో ఆర్సీబీ తడబడింది. 6 వికెట్లకు 203 పరుగులే చేయగలిగింది. రజత్ పాటీదార్ (61; 31 బంతుల్లో 3x4, 6x6) టాప్ స్కోరర్. టిమ్ డేవిడ్ (40; 17 బంతుల్లో 4x4, 3x6) రాణించాడు. ప్రిన్స్ యాదవ్ (3/33), షాబాజ్ అహ్మద్ (2/33) ఆర్సీబీని దెబ్బతీశారు.

**బెంగళూరు తడబాటు:**

ఛేదనలో ఆరంభం ఆర్సీబీకి పెద్ద షాక్. 9 పరుగులకే ఓపెనర్లు బెతెల్ (4), కోహ్లి (0) నిష్క్రమించారు. బెతెల్‌ను షమి వెనక్కి పంపగా.. కోహ్లిని ప్రిన్స్ యాదవ్ బౌల్డ్ చేశాడు. ఆ దశలో కెప్టెన్ పాటీదార్, పడిక్కల్ నిలిచారు. పడిక్కల్ చక్కని షాట్లు ఆడాడు. నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్న పాటీదార్.. క్రమంగా చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్లతో సిక్స్‌లు బాదేస్తూ జోరుగా పరుగుల వేట సాగించాడు. దిగ్వేశ్ రాఠి, మయాంక్ యాదవ్ ఓవర్లలో రెండేసి సిక్స్‌లు బాదాడు. పాటీదార్ 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లలో 104/2తో ఆర్సీబీ బలమైన స్థితిలో నిలిచింది. అయితే ఆ జట్టు సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న దశలో 8 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి లఖ్‌నవూ బలంగా పోటీలోకి వచ్చింది. పైచేయిలో నిలిచింది. ప్రిన్స్ ఒకే ఓవర్లో పడిక్కల్ (34), జితేశ్ శర్మలను ఔట్ చేసి ఆర్సీబీని గట్టి దెబ్బతీశాడు. జోరుమీదున్న పాటీదార్‌ను షాబాజ్ వెనక్కి పంపాడు. 112/5తో బెంగళూరు చిక్కుల్లో పడింది. ఆ తర్వాత ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన టిమ్ డేవిడ్‌ను 16వ ఓవర్లో షాబాజ్ ఔట్ చేశాడు. గెలవాలంటే ఆఖరి 3 ఓవర్లలో ఆర్సీబీ 47 పరుగులు చేయాల్సిన స్థితి. ఆ దశలో కృనాల్ విధ్వంసక బ్యాటింగ్‌తో లఖ్‌నవూను కలవర పెట్టాడు. కానీ ఆర్సీబీకి ఓటమి తప్పలేదు.

**దంచేసిన మార్ష్:**

లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో మార్ష్ ఆటే హైలైట్. చెలరేగి ఆడిన అతడు ఆ జట్టు బలమైన లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించాడు. లఖ్‌నవూ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. మార్ష్ ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17; 24 బంతుల్లో 1x4) పరుగుల కోసం కష్టపడ్డా, షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డా.. మార్ష్ మాత్రం విధ్వంసక షాట్లతో విరుచుకుపడ్డాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో స్ట్రెయిట్ సిక్స్‌తో మొదలైంది మార్ష్ జోరు. అదే ఓవర్లో అలాంటిదే బౌలర్ తలమీదుగా అతడు మరో సిక్స్ బాదేశాడు. భువనేశ్వర్, కృనాల్ పాండ్యలనూ మార్ష్ వదల్లేదు. విధ్వంసం కొనసాగిస్తూ రసిఖ్ సలామ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు బంతులను బౌండరీ దాటించాడు. ఈ క్రమంలో మార్ష్ 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. మరో వైపు అర్షిన్ సింగిల్స్ కూడా ఎక్కువగా తీయలేకపోయాడు. ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో అతడు 17 పరుగులు మాత్రమే చేశాడు. అయినా మార్ష్ మెరుపుల కారణంగా లఖ్‌నవూ 9 ఓవర్లలో 95/0తో బలమైన స్థితిలో నిలిచింది. ఆ దశలో వర్షం కారణంగా చాలా సమయం వృథా అయింది. తిరిగి ఆట మొదలయ్యాక అర్షిన్ ఔట్ కాగా.. మార్ష్ వీర బాదుడును కొనసాగించాడు. బలమైన షాట్లతో అలరించిన అతడు.. షెపర్డ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో సెంచరీ (49 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు పూరన్ నిలిచాడు. అయితే లఖ్‌నవూ 14 ఓవర్లలో 145/1తో ఉండగా వర్షం తిరిగి మొదలైంది. మళ్లీ సమయం వృథా అయింది. ఓ ఓవర్‌ను తగ్గించారు. మార్ష్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేసినా.. పంత్ విరుచుకుపడడంతో ఆఖరి మూడు ఓవర్లలో లఖ్‌నవూ 44 పరుగులు రాబట్టింది. హేజిల్‌వుడ్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన పంత్.. ఆఖరి ఓవర్లో, సలామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6తో మెరుపు ముగింపునిచ్చాడు. పూరన్ చివరి ఓవర్లో వెనుదిరిగాడు. అతడు మార్ష్‌తో రెండో వికెట్‌కు 70, పంత్‌తో మూడో వికెట్‌కు 29 పరుగులు జోడించాడు.

**లఖ్‌నవూ ఇన్నింగ్స్:**

మిచెల్ మార్ష్ (సి) బెతెల్ (బి) హేజిల్‌వుడ్ 111; అర్షిన్ కులకర్ణి (సి) పాటీదార్ (బి) కృనాల్ 17; పూరన్ (సి) కృనాల్ (బి) రసిఖ్ సలామ్ 38; పంత్ నాటౌట్ 32; మార్క్రమ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (19 ఓవర్లలో 3 వికెట్లకు) 209; వికెట్ల పతనం: 1-95, 2-165, 3-194; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-34-0; హేజిల్‌వుడ్ 4-0-49-1; కృనాల్ 4-0-31-1; రసిఖ్ సలామ్ 4-0-53-1; సుయాశ్ శర్మ 2-0-21-0; షెపర్డ్ 1-0-16-0

**బెంగళూరు ఇన్నింగ్స్:**

బెతెల్ (సి) ప్రిన్స్ (బి) షమి 4; కోహ్లి (బి) ప్రిన్స్ 0; పడిక్కల్ (సి) అండ్ (బి) ప్రిన్స్ 34; పాటీదార్ (సి) మార్క్రమ్ (బి) షాబాజ్ 61; జితేశ్ (సి) పంత్ (బి) ప్రిన్స్ 1; డేవిడ్ (సి) దిగ్వేశ్ (బి) షాబాజ్ 40; కృనాల్ నాటౌట్ 28; షెపర్డ్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 12, మొత్తం: (19 ఓవర్లలో 6 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 1-9, 2-9, 3-104, 4-106, 5-112, 6-158; బౌలింగ్: షమి 4-0-33-1; ప్రిన్స్ యాదవ్ 4-0-33-3; మయాంక్ 4-0-50-0; దిగ్వేశ్ 4-0-50-0; షాబాజ్ 3-0-33-2

# బర్త్ డేకి గ్రాండ్‌గా...

అభిమాన హీరో పుట్టినరోజు దగ్గర పడుతోందంటే అభిమానులు ఆ హీరో తాజా చిత్రాల అప్‌డేట్స్‌ని ఆశిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులు అలానే అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 20న ఈ హీరో పుట్టినరోజు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ఆశించేవాటిలో ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఒకటి. బర్త్ డేకి గ్రాండ్‌గా ఒక వీడియోను విడుదల చేయడానికి ఈ టీమ్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ వీడియోలో విజువల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని టాక్. కుమార స్వామి నేపథ్యంలో త్రివిక్రమ్ తెరకెక్కించనున్న ఈ మైథలాజికల్ మూవీకి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఓ వార్త ప్రచారంలో ఉంది. మరి... ప్రచారంలో ఉన్నట్లు వీడియోను విడుదల చేస్తారా? ఆ రోజు టైటిల్‌ని కూడా ప్రకటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమా అంగీకరించాక కుమార స్వామి గురించి తెలుసుకోవడానికి ఎన్టీఆర్ పుస్తకాలు చదువుతున్నారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు ఎన్టీఆర్. అలాగే 'దేవర' రెండో భాగం కూడా ఉంది.





# హృదయాన్ని కదిలిస్తుంది

హృదయాల్ని స్పృశించే అందమైన భావోద్వేగాలతో 'గోదారి గట్టుపైన' చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ వేసవిలో అందరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని అన్నారు చిత్ర కథానాయకుడు సుమంత్ ప్రభాస్. సుభాష్‌చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. మానవ విలువలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ సినిమా చూశాక తండ్రీకూతుళ్ల అనుబంధం తాలూకు గాఢత అర్థమవుతుందని, ప్రతీ అమ్మాయి వాళ్ల నాన్నకు ఫోన్‌చేసి 'ఐ లవ్ యూ డాడీ' అని చెబుతుందని సుమంత్ ప్రభాస్ అన్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రి కథ ఇదని దర్శకుడు సుభాష్‌చంద్ర తెలిపారు. థియేటర్‌లో చూసి ఫీల్ కావాల్సిన సినిమా ఇదని నిర్మాత అభినవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాండ్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. 'మనం నిజజీవితంలో చూసే పాత్రలు, సంఘటనలతో కూడిన ప్రేమకథ ఇది. ఈ ప్రేమకథలోని సంఘర్షణ అందరికీ కనెక్టయ్యేలా ఉంటుంది. అందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది' అని దర్శకుడు మధుదీప్ నమ్మకం వ్యక్తంచేశారు. ఇంకా నిర్మాత అరవింద్, హీరోహీరోయిన్లు త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, పంపిణీదారుడు ముత్యాల రాందాస్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేటివ్ వర్క్స్.

# వినోదాన్ని పంచే 'పురుషః'



పవన్‌కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పురుషః'. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల కోటేశ్వర రావు నిర్మాత. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. గురువారం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ..విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుందని అన్నారు. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందన సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచిందని నిర్మాత చెప్పారు. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్నందిస్తున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463